PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 243 | విజయవాడ, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 6 April 2025 | Rs

విఆర్ఎల సమస్యల పరిష్కారానికి

దశల వారీ పోరాటం

- జూన్ రెండో వారంలో నిరవధిక సమ్మె
- పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

2

చెపాక్‌లో మళ్లీ ఓడిన చెన్నై

- కెఎల్ రాహుల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు హ్యాట్రిక్ విజయాలు

6

పదునెక్కుతున్న పోరాటాలు

- ప్రజలు కదులుతున్నారు
- విలేకరుల సమావేశంలో బివి రాఘవులు

సీతారాంఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వివిధ సమస్యలపై ప్రజాపోరాటాలు జరుగుతున్నాయని, ప్రజలు కూడా పెద్దఎత్తున ఈ పోరాటాల్లో పాల్గొంటున్నారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. సిపిఎం 24వ అఖిల భారత మహాసభ నాల్గవ రోజైన శనివారం సీతారాం ఏచూరి నగర్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే పోరాటాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. మహాసభలో శనివారం ప్రవేశపెట్టిన ముసాయిదా నిర్మాణ నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నట్లు తెలిపారు. గత మహాసభ తరువాత గడిచిన మూడేళ్ల కాలంలో దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ పార్టీ పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించిందని చెప్పారు. ప్రజలు కూడా పెద్దఎత్తున కదిలి వీటిలో భాగస్వాములవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదారవాద విధానాలు ప్రజలకు పెనుభారంగా మారడమే దీనికి ప్రధాన కారణమని ఆయన చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో పాటు, సంక్షేమ పథకాలు నిర్వహించడం కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు కష్టంగా మారుతోందని, దీంతో ఆ భారాన్ని కూడా ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్నాయని అన్నారు, ఈ పరిస్థితులు ప్రజలు రోడ్ల మీదకు వచ్చి పోరాటం చేయక తప్పని స్థితిని కలిగిస్తున్నాయని చెప్పారు. కార్మికవర్గంపై పడుతున్న భారాలకు, పెరుగుతున్న ఒత్తిడికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేసిన పోరాటాలకు సిపిఎం క్రియాశీలకంగా మద్దతు ఇచ్చిందని తెలిపారు. రైతుల సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా చేసిన పోరాటానికి కూడా పార్టీ కీలక మద్దతు ఇచ్చినట్లు చెప్పారు. భూమి, ఇళ్లస్థలాలు, ఉపాధి కోసం తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్. రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో సిపిఎం ప్రజలను కదలించి పోరాటాలు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా కేరళలో పెద్దఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమాలు జరిగాయని,

మిగతా 5లో

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో అరుణ్ కుమార్, తరిగామి తదితరులు

13 తీర్మానాలు ...

వ్యవసాయ మార్కెటింగ్ కోసం రూపొందించిన నేషనల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను ఉపసంహరించు కోవాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్య, వైద్యం, ఆహారం, పెన్షన్ వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని మహాసభలో తీర్మానించినట్ల చెప్పారు. వీటితో పాటు మొత్తం 13 తీర్మానాలను శనివారం నాటి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు రాఘవులు తెలిపారు.

ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పారు. ఈ తీర్మానంపై జరిగిన చర్చల్లో 53 మంది ప్రతినిధులు పాల్గొన్నారని, మొత్తం 174 సవరణలు అందాయని చెప్పారు. చర్చకు పొలిట్‌బ్యూరో సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ సమాధానం ఇచ్చారని, అనంతరం మహాసభ ఆమోదించిందని చెప్పారు. క్రిస్టియన్లపై సంఘ్‌పరివార్ చేస్తున్న దాడులను ప్రస్తావించగా అటువంటి సంఘటనలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు

పేదరిక నిర్మూలనకు కొత్త ఆలోచనలు

- ఆర్థిక అసమానతలు తగ్గించాలి
- ముప్పాళ్ల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- చందర్లపాడు, నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

రాష్ట్రాభివృద్ధికి ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, వాటిని తగ్గించాలని అన్నారు. ఏ వ్యక్తీ పేదరికంలో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తలసరి ఆదాయం పెంపుదలకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో సిఎం చంద్రబాబు శనివారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. మాజీ ఉప ప్రధాని, కీర్తిశేషులు బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. విద్యార్థులకు ల్యాప్ టాప్‌లను అందజేశారు. పాదరక్షల తయారీ యూనిట్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పి-4లో భాగంగా 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కింద ఎంపికైన వారిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. 'బంగారు కుటుంబం'లో భాగంగా వేల్పుల వెంకట్రావమ్మ అనే మహిళ ఇంటికి సిఎం వెళ్లారు. ఆమె ఇంట్లో స్వయంగా కాఫీ తయారు చేసి బంగారు కుటుంబ సభ్యులకు అందజేసి తానూ తాగారు. ఆ కుటుంబ సభ్యులతో ఫొటో దిగారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజావేదిక వద్ద సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్‌సి కార్పొరేషన్, వికలాంగుల సంక్షేమ శాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. మహిళలతో మాట్లాడారు. వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా వివిధ కేటగిరీలకు చెందిన పది మంది లబ్ధిదారులకు రూ.3,40,200 విలువైన ఉపకరణాలను అందించారు. ప్రజావేదికలో పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పేదల సేవలో భాగంగా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. స్వయం ఉపాధి కింద అనేక పథకాలు తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థికంగా స్థిరపడిన వారు సమాజానికి ఎంతోకొంత సేవ చేయాలని, అట్టడుగున ఉన్నవారికి

మిగతా 5లో

అదనపు నిధుల సమీకరణకు అనుమతి

- సిఆర్‌డిఎ 46వ అథారిటీ సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం కోసం అవసరమైన మిగిలిన నిధులు వివిధ రూపాల్లో సమీకరించేందుకు సిఆర్‌డిఎ కమిషనరుకు అనుమతినిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో శనివారం సిఆర్‌డిఎ 46వ అథారటీ సమావేశం సిఎం అధ్యక్షతన జరిగింది. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా మిగిలిన అవసరమైన నిధులను వివిధ ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి సమీకరించేందుకు సిఆర్‌డిఎ కమిషనరుకు అనుమతినిచ్చింది. అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం తెలిపిన అథారిటీ, ఎల్‌వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. అసెంబ్లీని బేస్‌మెంట్ ప్లస్ జి ప్లస్3ప్లస్ వ్యూయింగ్ ప్లాట్ ఫారమ్‌లు పల్స్ పనరమిక్‌వ్యూ (బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు, ఎత్తు 250 మీటర్లు) అసెంబ్లీ నిర్మాణానికి టెండర్లలో ఎల్‌వన్‌గా నిలిచిన సంస్థకు ఎల్ఒఎ ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. హైకోర్టు బేస్‌మెంట్ ప్లస్ జి ప్లస్ 7 అంతస్తుల్లో నిర్మాణం, బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు, ఎత్తు 55 మీటర్లు, ఎల్‌వన్‌గా నిలిచిన సంస్థకు ఎల్ఒఎ ఇచ్చేందుకు కూడా సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ, సిఆర్‌డిఎ అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షం

- జోరువానకు తడిసిన మిర్చి
- ఆందోళనలో రైతులు

2

'వక్ఫ్' తరువాత చర్చిలపై సంఘ్ దృష్టి

పినరయి విజయన్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించిన అనంతరం సంఘ్‌పరివార్ చర్చిలపై దృష్టి సారించిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. సిపిఎం అఖిల భారత మహాసభ జరుగుతున్న సీతారాం ఏచూరినగర్ ప్రాంగణం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడం ద్వారా నరేంద్రమోడీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల రాజ్యాంగ హక్కులపై తీవ్రమైన దాడి చేసిందని విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణ తరువాత దేశవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ చర్చిలపై సంఘ్ పరివార్ దాడికి దిగుతోందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక 'ఆర్గనైజర్'లో ప్రచురితమైన ఒక వ్యాసం ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోందని పినరయి విజయన్ చెప్పారు. 'సంఘ్ లక్ష్యాలను ఆ వ్యాసం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది' అని ఆయన అన్నారు. చర్చి ఆస్తుల విషయాలను అసందర్భంగా ప్రస్తావించడమే కాకుండా, తన శ్రేణులకు చర్చి పట్ల వ్యతిరేక సంకేతాలను పంపుతోందని ఆయన అన్నారు. ఆర్గనైజర్ వెబ్‌సైట్‌లో ఉంచిన ఆ వ్యాసాన్ని ప్రస్తుతం తొలగించినప్పటికీ, సంఘ్ పరివార్ అసలు ఉద్దేశాలు స్పష్టంగా వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ యొక్క అసలైన ఆలోచనా ధోరణులకు ఆ వ్యాసం అద్దం పట్టిందని చెప్పారు. మెజార్టీ వాదం పేరుతో సంఘ్ పరివార్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, మైనార్టీ మతాలను లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. క్రమంగా వారిని అణచివేయాలన్న విస్తృత కార్యాచరణలో భాగంగానే ఈ తరహా చర్యలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతంగా ఉన్న భారతీయ సంస్కృతిపైన, రాజ్యాంగంపైన సంఘ్‌పరివార్ శక్తులు చేస్తున్న ఈ దాడులను ఎదుర్కొనేందుకు ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా స్పందించాలని ఆయన కోరారు.

కేరళ సిఎం పినరయి విజయన్, ఎంఎ బేబిలను కలిసిన సినీ ప్రముఖులు ప్రకాష్‌రాజ్, మారి సెల్వరాజ్, టిజె జ్ఞాన్‌వేల్

ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే!

- సంఘ్ పరివార్ పత్రిక 'ఆర్గనైజర్'లో ప్రత్యేక కథనం
- పినరయి విజయన్, రాహుల్ గాంధీ విమర్శల నేపథ్యంలో తొలగింపు

5

గ్రూప్-2 మెయిన్స్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-2 ప్రధాన పరీక్షా ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) అధికారులు విడుదల చేశారు. 79,451 మంది పరీక్ష రాయగా, 1:2 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు 2,168 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. 899 ఉద్యోగాల భర్తీ కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 23న గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించగా, ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన తేదీలను వ్యక్తిగతంగా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే, గ్రూప్-2 ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల అంశంపై హైకోర్టు లో కేసు పెండింగ్‌లో ఉండటంతో తుది తీర్పున కు లోబడి నియామక ప్రక్రియ చేయపట్టను న్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. ఫలితాలతో పాటు మెయిన్ పరీక్ష ఫైనల్ కీని కూడా వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

నిర్బంధాన్ని ఎదురొడ్డి నిరసన

- తొలగింపులను వ్యతిరేకిస్తూ ఉక్కు కాంట్రాక్టు కార్మికుల రాస్తారోకో

2

ఏడు కీలక ఒప్పందాలపై

భారత్, శ్రీలంక సంతకాలు

కొలంబో : మొట్టమొదటిసారిగా, భారత్, శ్రీలంక బహ్మృత్తరమైన రక్షణ సహకార ఒప్పందంపై శనివారం సంతకాలు చేశాయి. మరింత సమగ్రమైన రీతిలో ద్వైపాక్షిక సహకారానికి చేపట్టాల్సిన విస్తృత ప్రణాళికను ప్రధాని మోడీ వివరించారు. ఇరు దేశాలు పరస్పరం ఆధారపడి వున్నాయని, వాటి భద్రత కూడా ముడిపడి వుందని ఆయన పేర్కొన్నారు. ఇరు పక్షాలు ఏడు కీలకమైన ఒప్పందాలపై సంతకాలు చేయగా వాటిలో రక్షణ ఒప్పందం ఒకటి. అంతకుముందు ప్రధాని మోడీ, శ్రీలంక అధ్యక్షులు అనురకుమార దిసనాయకె విస్తృతాంశాలపై చర్చలు జరిపారు. 'ఇరు దేశాల భద్రత పరస్పరం ముడిపడి వుంది, ఆధారపడి వుంది. భారత ప్రయోజనాల గురించి శ్రీలంక అధ్యక్షులు దిసనాయకె ఆలోచిస్తున్నందుకు కృతజ్ఞతలు. రక్షణ సహకారంతో సహా పలు ముఖ్యమైన ఒప్పందాలను స్వాగతిస్తున్నాం' అని మోడీ పేర్కొన్నారు. కీలకమైన సమయాల్లో భారత్ అందించిన సాయానికి, కొనసాగిస్తున్న సంఘీభావానికి తామెంతగానో రుణపడి వున్నామని దిసనాయకే పేర్కొన్నారు. ట్రింకోమలిని ఇంధన కేంద్రంగా అభివృద్ధిపరచడానికి మరో కీలకమైన ఒప్పందంపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి.

మోడీకి 'మిత్ర విభూషణ' పురస్కారం

ద్వైపాక్షిక సంబంధాలకు ఊతమివ్వడంలో ప్రధాని మోడీ చేసిన సేవలకు గుర్తింపుగా శ్రీలంక అధ్యక్షులు దిసనాయకె, మోడీకి మిత్ర విభూషణ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శ్రీలంక అత్యున్నత పౌర పురస్కారమైన ఈ అవార్డును 2008 ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు అందిన గౌరవమని మోడీ వ్యాఖ్యానించారు.

మోడీకి 'మిత్ర విభూషణ' పురస్కారం ప్రదానం చేస్తున్న దిసనాయకే

మైక్రోసాఫ్ట్ స్వర్ణోత్సవాల్లో నిరసన తెలియజేస్తున్న ఆ సంస్థ ఉద్యోగి అబ్దిహాల్ అబౌసాద్

మీ చేతులకు రక్తం అంటింది!

- యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌కు మైక్రోసాఫ్ట్ ఎఐ టెక్నాలజీ
- స్వర్ణోత్సవ వేడుకల్లో ఉద్యోగుల నిరసన

వాషింగ్టన్ : 'ఇక చాలు ఆపండి.. ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)ని మంచి కోసం ఉపయోగిస్తామన్న మాటలు కట్టిపెట్టండి. లాభాల కోసం ఇజ్రాయిల్ సైన్యానికి విక్రయిస్తున్నారు. గాజాలో ఇజ్రాయిల్ నరమేధం సృష్టిస్తోంది. మీ చేతులకు రక్తమంటింది. మొత్తం మైక్రోసాఫ్ట్ రక్తంతో తడుస్తోంది' అంటూ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు ఒకరి తర్వాత మరొకరు ఆ సంస్థ ఎఐ విభాగం సిఇఒ ముస్తఫా సులేమాన్‌ను నిలదీశారు. మైక్రోసాఫ్ట్ 50వ వార్షికోత్సవం (స్వర్ణోత్సవం) సందర్భంగా వాష్టింగ్టన్‌లోని సంస్థ ప్రధానకార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఈ ఘటన

మిగతా 5లో

తీవ్రంగా గాయపడిన యువతి

యువతిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-చీపురుపల్లి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం గ్రామంలో 18 ఏళ్ల యువతిని గుర్తు తెలియని దుండగుడు కత్తితో పొడిచి పరారయ్యాడు. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... బాధితురాలు తన ఇంట్లో ఉండగా మాస్కు ధరించిన ఓ వ్యక్తి తనతో తెచ్చుకున్న కత్తితో ఆమె కడుపులో పొడిచి పరారయ్యాడు. దీంతో, యువతిని కుటుంబ సభ్యులు చీపురుపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ కేసు మిస్టరీని త్వరలో ఛేదిస్తామన్నారు. ఇందుకోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

ఫార్మా విష కోరల్లో అల్లాడపాలెం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఫార్మా కంపెనీల కాలుష్యం, వ్యర్థాలతో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని అల్లాడపాలెం గ్రామం అల్లాడుతోంది. గ్రామంలోని ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది. భూగర్భ జలాలు కలుషితం కావడంతో తాగునీటినీ కొనుక్కోవాల్సి వస్తోంది. పంటల దిగుబడి తగ్గిపోతోంది. ఈ గ్రామాల వారితో సంబంధాలు కలుపుకోవడానికి ఇతర గ్రామాల వారు ఇష్టపడకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని కందివలస గెడ్డకు ఆనుకుని అరబిందో, రెడ్డీస్, శేషసాయి, గ్రీన్ టెక్ కెమికల్ లేబొరెటరీస్ వంటి ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు కాలుష్య నివారణ చర్యలను పాటించడం లేదు. వ్యర్థాలను యథేచ్ఛగా కందివలస గెడ్డలోకి వదిలేస్తున్నాయి. దీంతో, కాలుష్యానికి గురై దీని నీరు నిత్యం ఎర్రబారిపోయి కనిపిస్తోంది. ఈ నీరు భూగర్భ జలాల్లోకి వెళ్తోంది. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. బోరు నీరు కూడా మందుల వాసన వస్తోందని, తాగలేకపోతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన వైద్యశిబిరానికి వచ్చిన వైద్యులు 'ఈ నీరు తాగొద్దు' అంటూ హెచ్చరించారు. దీంతో,, కొన్ని కిలోమీటర్ల దూరంలోని

మిగతా 5లో

పంటల దిగుబడిపైనా తీవ్ర ప్రభావం

ఫార్మా పరిశ్రమల కాలుష్యం వల్ల ఎర్రగా మారిన కందివలస గెడ్డ నీరు

రజక వృత్తికి దూరమయ్యాం

తరతరాలుగా కందివలస గెడ్డలో గ్రామస్తుల బట్టలు ఉతికి, వారిచ్చిన గింజలు, డబ్బులతో కుటుంబాలను పోషించుకొనే వాళ్లం. గెడ్డలో నీరు పూర్తిగా కలుషితం కావడంతో పదేళ్లుగా వృత్తికి దూరమయ్యాం. మా వృత్తిదారులెవరికీ సెంటు భూమీ లేదు, ఇతర పనులూ లేవు.

-శీల కృష్ణమ్మ, రజక వృత్తిదారు, అల్లాడపాలెం

కొబ్బరి దిగుబడి సగానికి పడిపోయింది

నాకున్న రెండెకరాల్లో వంద కొబ్బరి చెట్లు ఉన్నాయి. గతంలో ఏడాదిలో ఆరు దఫాలుగా సుమారు రెండు వేల బొండాల దిగుబడి వచ్చేది. క్రమంగా దిగుబడి వెయ్యికి తగ్గిపోయింది. వాయు, నీటి కాలుష్యమే ఇందుకు కారణం. వరి, ఇతర పంటల్లోనూ ఈ రకమైన ప్రభావం ఉంది.

-లంకపల్లి నారాయణరావు, అల్లాడపాలెం,

విఆర్ఎల సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటం

- జూన్ రెండో వారంలో నిరవధిక సమ్మె
- పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్ఎల సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటం చేయాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, పే స్కేల్ జీతాలు, ప్రమోషన్స్ కల్పించాలని, డిఎను జీతంలో కలపడంతోపాటు మిగిలిన సమస్యలను మే నెలాఖరులోగా పరిష్కరించాలని విఆర్ఎల రాష్ట్ర సదస్సు తీర్మానించింది. లేనిపక్షంలో జూన్ రెండో వారంలో నిరవధిక సమ్మెకు దిగాలని కూడా సదస్సు నిర్ణయించింది. విజయవాడ బందరురోడ్డులోని ఎంబివికెలో శనివారం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (విఆర్ఎ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సు పలు తీర్మాణాలు చేసింది. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలనే డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6, 7 తేదీల్లో తహశీల్దారుకు, 8, 9 తేదీల్లో ఆర్‌డిఒలకు, 10, 11, 12 తేదీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులకు, 15, 16 తేదీల్లో కలెక్టర్లకు రాయభారాలు, ఏప్రిల్ 28, 29 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో దీక్షలు, 30న కలెక్టర్లకు సామూహిక రాయభారం, మే నెల 13, 14 తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో రిలే దీక్షలు నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కేవలం రూ.10,500 జీతంతో విఆర్ఎల కుటుంబాలు అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 70 శాతం అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి విఆర్ఎలు నిర్వహించే న్యాయమైన పోరాటానికి పిడిఎఫ్ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు లక్ష్మణరావు ప్రకటించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు విజన్-2047 ద్వారా పేదరికాన్ని నిర్మూలిస్తామంటున్నారని, విఆర్ఎల జీవితాల గురించి పల్లెత్తు మాట్లాడటం లేదని అన్నారు. గత ఎనిమిదేళ్లుగా విఆర్ఎల జీతాలు పెరగక కుటుంబాలు పస్తులతో బతుకుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేల్ జీతాలు చెల్లించి విఆర్ఎ కుటుంబాలకు భరోసా కల్పిస్తారని ఆశించిన విఆర్ఎల ఆశలను నీరుగార్చిందన్నారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న నామినీలను విఆర్ఎలుగా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. మే నెలాఖరులోగా సమస్యలను సానుకూలంగా పరిష్కరించకుంటే దశలవారీ పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని, అవసరమైతే కలిసి వచ్చే సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర నాయకులు త్రినాథరావు, రవికుమార్, కృష్ణారావు, గురుమూర్తి, కొండబాబు, రమణ, శేఖర్, వెంకటపతి, రత్నబాబు, రహిమాన్, మొగలాబి, వెంకట్, సిఐటియు నాయకులు వి లక్ష్మణరావు, జి శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు

ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైసిపి నేతపై హత్యాయత్నం

- భద్రతా వలయంలో గోవిందపల్లి

ప్రజాశక్తి - శిరివెళ్ల (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల పరిధిలోని గోవిందపల్లిలో శనివారం వైసిపి నేతపై హత్యాయత్నం జరిగింది. గతంలో జరిగిన జంట హత్యల నెత్తుటి మరకలు ఆరకముందే మరో హత్యాయత్నం సంచలనంగా మారింది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్ గదికి కేవలం పది మీటర్ల దూరంలోనే హత్యాయత్నం ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శిరివెళ్ల మండల వైసిపి కన్వీనర్ ఇందూరి ప్రతాపరెడ్డి శనివారం ఆంజనేయ స్వామి గుడికి వెళ్లారు. గుడి ఎదురుగా టిడిపి నాయకులు రవిచంద్రారెడ్డి వేట కొడవలితో ఆయనపై దాడి చేశారు. దీంతో, ప్రతాపరెడ్డి అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాల పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. నంద్యాల జిల్లా ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా, ఆళ్లగడ్డ డిఎస్‌పి ప్రమోద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న పోలీస్ పికెట్ గదిలోని సిసి ఫుటేజ్‌ని పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షులు, సిసిటివి ఫుటేజి ఆధారంగా నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్‌పి విలేకరులకు చెప్పారు. నంద్యాలలో చికిత్స పొందుతున్న ప్రతాపరెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పరామర్శించారు.

అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

బ్రహ్మోత్సవాలకు ఒంటిమిట్ట సిద్ధం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా కడపలోని ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయం వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 6 నుండి 14వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ నిర్వహించారు. శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. 6న ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవ జరుగనున్నాయి. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం శ్రీరాముల వారికి టిటిడి తరుపున చైర్మన్ బిఆర్ నాయుడు ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

తిరుమలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - రేణిగుంట

తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా శనివారం మధ్యాహ్నం తిరుమలకు విచ్చేశారు. రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్, చిత్తూరు జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఇ.భీమారావు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలో ఆయన బస చేసి ఆదివారం ఉదయం శ్రీవారి దర్శించుకోనున్నారు.

పర్యాటక ప్రాజెక్టుల అధ్యయనానికి కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి వస్తున్న ప్రైవేటు పర్యాటక ప్రాజెక్టులను పరిశీలించి వాటి వల్ల ప్రయోజనం అంచనా వేయడం, వాటికి రాయితీలు ఇచ్చే అంశాల పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానాన్ని అనుసరించి వివిధ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు పలు ప్రైవేటు సంస్థలు ముందుకొస్తున్న నేపథ్యంలో వాటి వల్ల ప్రయోజనాలు అంచనా వేయడం కోసం, అదే విధంగా ఆయా ప్రాజెక్టులకు నూతన పాలసీ ప్రకారం రాయితీలు ఇచ్చే అంశాలను 9 మంది అధికారులతో కూడిన కమిటీ అంచనా వేస్తోంది. కమిటీకి ఛైర్మన్‌గా ఎపిటిఎ సిఇఒ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎపిటిడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇంజినీరు, ఎపిడిఎ చీఫ్ అకౌంట్స్ అధికారి, హెచ్‌ఒడి (ఐడిజి సెక్షన్), ఎపిటిడిసి జిఎం, ఎజిఎం, ఆర్థికశాఖ పిపిపి నిపుణులు, ఎపిటిఎ సిఇఒ నామినేట్ చేసిన ఒక అధికారి, డిప్యూటీ సిఇఒ, ఇడి (ఆపరేషన్స్) ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేలమంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. రానున్న మూడేళ్ల కాలంలో లక్ష మందికి పైగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చేస్తామన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో శనివారం మహిళా వ్యాపారాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై ఒకరోజు వర్క్‌షాప్‌ను మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఎం సమక్షంలో ఒక్కరోజులో అత్యధిక ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులు ఆన్‌లైన్ ద్వారా అమ్మినందుకు గిన్నీస్, ప్రపంచ రికార్డులు సాధించినందుకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది కనీసం 80 వేల సంఘాలకు, రూ.8 వేలకోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా పట్టణ పేద కుటుంబాలకు అందించాలని మెప్మా సిబ్బందికి నారాయణ ఆదేశించారు. స్వయం సహాయక మహిళల 20 వేల ఉత్పత్తులను ఇ-కామర్స్‌లో అన్బోర్డ్ చేసి ఈ ఏడాది రూ.10 వేలకోట్ల విలువైన విక్రయాలు జరపాలని లక్ష్యంగా నిర్దేశిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. 2047 విజన్‌లో పేదరిక నిర్మూలన ఒక అంశమన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘం మహిళల కోసం మెప్మా అధికారిక వెబ్‌సైట్, మహిళాకాశం యాప్, పట్టణ నిరాశ్రయుల వసతి గృహం కోసం నివాసం యాప్, మెప్మా లోన్ ఛార్జ్ క్రియేషన్ మెకానిజం, మెప్మా సిబ్బంది కోసం హెచ్‌ఆర్‌ఎంఎస్ డాష్ బోర్డును మంత్రి నారాయణ ప్రారంభించారు. అసంఘటిత రంగం కార్మికుల కోసం ఏర్పాటుచేసిన ఇ-శ్రమ్ పథకంతో అనుసంధానం చేస్తూ వారికి ఆర్థిక భద్రత కల్పించేందుకు గానూ మెప్మా, కార్మికశాఖల మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఎస్‌సి లబ్ధిదారులకు మార్చి 2025, బ్యాంక్ లింకేజీ రుణం రూ.143.55 కోట్లు, పిఎం స్వానిధి రుణం రూ.2.21 కోట్లు చెక్కులను మంత్రి నారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు, మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్, ఎడి ఐ మాధవి పాల్గొన్నారు.

అకాల వర్షం

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి, బొప్పాయి

జోరువానకు తడిసిన మిర్చి

ఆందోళనలో రైతులు

అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఈదురు గాలులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు అరటి, బొప్పాయి పంటలు నేలవాలాయి. వర్షానికి పొలల్లో ఉన్న మిర్చి తడిసిపోయింది. అకాల వర్షానికి పొగాకు, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రహదారులు జలమయం అయ్యాయి.

అల్లూరి జిల్లా కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. కొయ్యూరు మండలం కొమ్మిక మెయిన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. కొమ్మిక - రేవళ్ల మార్గంలో చెట్లు నేలకొరిగాయి. పాడేరులో కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. అనకాపల్లి జిల్లా యలమంచిలి, కశింకోట, అచ్యుతాపురం, బుచ్చయ్యపేట, కె.కోటపాడు, కోటవురట్ల మండలాల్లో కురిసిన అకాల వర్షంతో నువ్వు పంటకు నష్టం చేకూరుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విశాఖలో పలుచోట్ల 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. అక్కడక్కడా చిరు జల్లులు పడ్డాయి. కొద్ది రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిన జనాలు శనివారం కురిసిన వర్షంతో కాసింత ఉపశమనం లభించింది.

దక్షిణ అండమాన్‌లో ఉపరితల ఆవర్తనం

దక్షిణ అండమాన్, పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో శనివారం నాటికి బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం విస్తరించింది. మరోవైపు ఉత్తర-దక్షిణ ద్రోణి ఉత్తర మధ్య మహారాష్ట్ర నుంచి ఉత్తర తమిళనాడు వరకూ అంతర్గత కర్ణాటక మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాంల్లో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నాయి. దీని ఫలితంగా పలుచోట్ల ఉత్తర కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురియనున్నాయి. ఆదివారం కూడా ఈ వాతావరణం కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కురిసిన వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షానికి పొలాల్లో ఉన్న మిర్చి తడిసిపోతుందని రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. ఈదురుగాలులకు అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. పలుచోట్ల పొగాకు, ఉద్యాన పంటలకు పంటకు నష్టం వాటిల్లింది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో కురిసిన వర్షానికి మొక్కజొన్న, మామిడికి నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి.

నిర్బంధాన్ని ఎదురొడ్డి నిరసన

- తొలగింపులను వ్యతిరేకిస్తూ ఉక్కు కాంట్రాక్టు కార్మికుల రాస్తారోకో

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగింపులు ఆపాలని కోరుతూ 'ఉక్కు' కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు దిగారు. ప్లాంట్ ప్రగతిలో కీలకపాత్ర పోషించిన తమను ప్రైవేటీకరణలో భాగంగా అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ పెద్ద పెట్టున నినదించారు. వారి పోరాటాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించినప్పటికీ కార్మికవర్గం ప్రతిఘటించింది. కూర్మన్నపాలెం కూడలిలో శనివారం రాస్తారోకో చేపట్టి తన నిరసనగళాన్ని వినిపిం చింది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపులను ఆపాలంటూ ఈ నెల 16 నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పోరాటాన్ని వారు ధృతం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో శనివారం సాయంత్రం భారీ రాస్తారోకో జరగనుందన్న సమాచారంతో విశాఖ నగరంలోని సౌత్ సబ్ డివిజన్, హార్బర్ డివిజన్, వెస్ట్ డివిజన్ పరిధిలోని 300 మంది పోలీసులు కూర్మన్నపాలెం కూడలిలో మోహరించారు. నిరసన తెలిపేందుకు వస్తున్న కాంట్రాక్టు కార్మికులను అడ్డుకున్నారు. వారిని ప్రతిఘటిస్తూనే కార్మికులు రాస్తారోకో చేపట్టారు. పోలీసుల చర్యలతో ఉద్రిక్త వాతావరణం నడుమ ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది. ఉక్కులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే పనిలోకి తీసుకోవాలని, మెడికల్ చెకప్‌లు ఆపాలని, ఎవ్వరినీ విధుల నుంచి తొలగించరాదని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులంతా నినాదాలతో హోరెత్తించారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దశలవారీగా 5,600 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని కుట్రలు చేస్తోందన్నారు. పోరాటాలతో ఆ ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిసినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కలుగజేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, కె.వంశీకృష్ణ, పితాని భాస్కరరావు, పి.గురునాథ్, భాస్కరరావు, వేణు, యు.అప్పారావు పాల్గొన్నారు. కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి సిపిఎం 78వ వార్డు (ఉక్కునగరం) కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మద్దతు తెలిపారు.

నిరసన తెలుపుతున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

చిన్నారిపై లైంగిక దాడి

- బాలుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి- లక్కవరపుకోట (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలో ఘోరం జరిగింది. ఐదేళ్ల బాలికపై 15 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక కుటుంబసభ్యుల కథనం ప్రకారం... రంగరాయపురం పంచాయతీ రెల్లిపేటకు చెందిన ఒక బాలుడు శనివారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో అదే పేటకు చెందిన ఒక బాలిక ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించి ఆ బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులను ఆర్‌డిఒ కీర్తి శనివారం పరామర్శించారు. విజయనగరం డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ నవీన్‌పడాల్ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. బాలుడిపై పోక్సో, అత్యాచారం కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని జువైనల్ కోర్టుకు తరలించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యయంపై త్రైమాసిక పరిమితులు

- తొలి త్రైమాసికానికి 35 శాతమే
- దాటి ఖర్చు పెట్టొద్దంటున్న ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

శాఖలవారీ చేయాల్సిన ఖర్చుపై ఆర్థికశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏయే త్రైమాసికాల్లో కేటాయించిన నిధులను ఎలా ఖర్చు చేయాలన్న దానిపై స్పష్టత ఇచ్చింది. దీనిని అన్ని శాఖలూ యథాతథంగా పాటించాలని నిర్దేశించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 వార్షిక బడ్జెట్‌ను రూ.3.31 లక్షల కోట్లకు ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్ ఈ నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి కూడా వచ్చింది. అయితే బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పరిమితికి మించి ఖర్చు చేయరాదని ఆర్థికశాఖ నిర్దేశించింది. మొత్తం నాలుగు త్రైమాసికాల్లో ఈ నిధులను ఎంతవరకు ఖర్చు చేయాలన్నదానిపైనా స్పష్టతనిచ్చింది. జూన్ వరకు కొనసాగే తొలి త్రైమాసికంలో శాఖలకు కేటాయించిన నిధుల్లో 35 శాతానికి మించి వ్యయం చేయరాదని పేర్కొంది. అలాగే జులై నుంచి సెప్టెంబర్ వరకు ఉండే రెండో త్రైమాసికంలో 55 శాతానికి మించి ఖర్చు చేయరాదని, మూడో త్రైమాసికంలో మొత్తం వ్యయం 75 శాతానికి మించరాదని స్పష్టం చేసింది. ఈ పరిమితితో కూడిన వ్యయానికి సంబంధించి అన్ని శాఖలు పూర్తిస్థాయి ప్రతిపాదనలు పంపించాలని నిర్దేశించింది. ఇందుకు అనుగుణంగానే బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లను విడుదల చేస్తామని ఆర్థికశాఖ పేర్కొంది.

కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి జీతాల పద్దులకు మినహాయించి మిగిలిన పద్దులకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు ఇస్తామని పేర్కొంది. అది కూడా ఆయా పథకాలకు కేంద్రం నుంచి వచ్చే నిధులకు రాష్ట్ర వాటా నిధులపై ఈ బిఆర్‌ఒలు ఉంటాయని వివరించింది. జీతాలకు సంబంధించి ఆయా ప్రాజెక్టుల నిర్వహణ యంత్రాంగం నుంచి వచ్చిన బిల్లులను ట్రెజరీ అధికారులు ఆయా శాఖల నిధుల నుంచి విడుదల చేస్తారని వివరించింది.

మార్గదర్శకాలతోనే కొత్త పథకాలకు

వార్షిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన కొత్త పథకాలకు ఆయా శాఖల నుంచి పూర్తిస్థాయిలో వచ్చిన ప్రతిపాదనలు, మార్గదర్శకాల తరువాతే కావాల్సిన నిధులపై బిఆర్‌ఒలు విడుదల చేయనున్నట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. ఆ ప్రతిపాదనల్లోనే కార్యాచరణ ప్రణాళిక కూడా ఉండాలని స్పష్టం చేసింది. శాఖల నుంచి రావాల్సిన ప్రతిపాదనలపై కాలపరిమితి కూడా విధిస్తూ ఈ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చింది.

పేదల పెన్నిధి జగ్జీవన్‌రామ్

- శాసన మండలి చీఫ్ విప్ అనురాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదల పెన్నిది, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, మాజీ మంత్రి పీతల సుజాతతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్‌కు కెవిపిఎస్ నివాళి

బాబూ జగ్జీవన్‌రామ్‌కు కెవిపిఎస్ ఘనంగా నివాళులర్పించింది. విజయవాడలోని శిఖామణి సెంటర్‌లో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా నాయకులు జి క్రాంతి కుమార్, జి నటరాజ్, గురుమూర్తి, శ్యామ్, గంగాధర్, విజయ్, సత్తిబాబు, కొటేశ్వరరావు, వరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్‌కు పూల మాలలు వేసి నివాళులర్పించడమంటే మనువాద మతోన్మాదుల చేతుల్లో దగ్ధమవుతున్న రాజ్యాంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడమేనన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అవసరమని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేం

స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేమని పిసిసి నాయకులు వి గురునాథం పేర్కొన్నారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు పోతురాజు యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఆరుగురు అరెస్ట్

- కార్లు, సెల్ ఫోన్లు, కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతిలో ఓ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన కేసును పోలీసులు శనివారం ఛేదించారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు కార్లు, ఏడు సెల్ ఫోన్లు, నాలుగు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలే కారణమని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వివరాలను తిరుపతి డిఎస్‌పి శ్రీలత శనివారం మీడియాకు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జీవకోన ప్రాంతానికి చెందిన రాజేష్ తన భార్య సుమతి, పిల్లలు, తల్లి విజయతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన భార్గవ్ మూడేళ్ల కిందట రాజేష్ వద్ద రూ.24 లక్షల నగదు అప్పుగా తీసుకున్నారు. డబ్బులు తిరిగి చెల్లించాలని భార్గవ్‌ను రాజేష్ కొంత కాలంగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో రాజేష్ తల్లికి రూ.1.5 కోట్ల ధనం వస్తుందని తెలుసుకున్న భార్గవ్, తన స్నేహితుడైన అరుణ్ కుమార్‌తో కిడ్నాప్‌కు ప్లాన్ వేశాడు. తీసుకున్న నగదు చెల్లిస్తానని చెప్పి అక్కారంపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్ వద్దకు రావాలని నమ్మబలికారు. అతని మాటలు నమ్మిన మార్చి 28న రాజేష్ .. కుటుంబంతో కలిసి వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న కిడ్నాపర్లు రాజేష్ కుటుంబాన్ని బంధించి నగదు డిమాండ్ చేశారు. చిత్తూరులో ఉన్న తమ బంధువుల ఇంటికి తీసుకెళ్తే నగదు ఇస్తానని రాజేష్ చెప్పారు. దీంతో వారంతా కారులో బయలుదేరారు. ఐతేపల్లె వద్దకు రాగానే రాజేష్ కారులో నుంచి దూకేసి పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు కిడ్నాపర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులకు దొరికిపోతామని భయపడిన కిడ్నాపర్లు చిత్తూరులో రాజేష్ తల్లిని, భార్యా పిల్లలను మరొక చోట వదిలేసి పారిపోయారు. కిడ్నాప్‌కు పాల్పడిన జీవకోనకు చెందిన సంగీతం భార్గవ్, తిమ్మినాయుడుపాలెం పంచాయతీకి చెందిన వట్టికుంట అరుణ్ కుమార్, శ్రీకాళహస్తి మండలం జోగరాజుపల్లికి చెందిన దామతోటి సాయి కుమార్, రేణిగుంట మండలం తిమ్మయ్య గుంటకు చెందిన బలిపాకు మణికంఠ, ఏర్పేడు మండలం ఇసుకతగేలికి చెందిన చీరాల ప్రకాష్, పెళ్లకూరు మండలం చిల్లకూరు హరిజనవాడకు చెందిన సిరియల గణేష్‌లను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

భగ్గుమన్న టిడిపి, జనసేన విభేదాలు

- పోలీస్ బందోబస్తు మధ్య నాగబాబు పర్యటన

ప్రజాశక్తి- పిఠాపురం(కాకినాడ జిల్లా)

నినాదాలు చేస్తున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో మరోసారి టిడిపి, జనసేన పార్టీల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. 'పవన్ కల్యాణ్ గెలుపు నావల్లే అనుకుంటే వారి కర్మ' అంటూ పరోక్షంగా వర్మను ఉద్దేశించి జనసేన పార్టీ ఆవిర్భావ సభలో నాగబాబు చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని లేపాయి. అప్పటి నుంచి టిడిపి శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎల్‌సి నాగబాబు... పిఠాపురం నియోజకవర్గంలోని శుక్ర, శనివారాలు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారిక హోదాలో పాల్గొన్నారు. వీటికి మాజీ ఎంఎల్ఎ వర్మ దూరంగా ఉన్నారు. శనివారం గొల్లప్రోలు, పిఠాపురం మండలం కుమారపురం, చిన్న జగ్గంపేట, కొత్తపల్లి మండలంలో నాగబాబు పర్యటించారు. ఈ క్రమంలో టిడిపి శ్రేణులు జై వర్మ..జై జై వర్మ అంటూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. వీరికి పోటీగా జనసేన శ్రేణులు సైతం 'జై జనసేన.. జై పవన్.. జై నాగబాబు' అంటూ నినాదాలతో హోరెత్తించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రారంభోత్సవాలకు తమ నాయకుడు వర్మను ఎందుకు ఆహ్వానించలేదంటూ టిడిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ఫ్లెక్సీలు, శిలాఫలకాల్లో సిఎం చంద్రబాబు పేరు, ఫొటోలు లేవంటూ ఆందోళనకు దిగుతున్నారు. చిన్నజగ్గంపేట ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్మను ఆహ్వానించకపోవడంపై నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌ను టిడిపి శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు బందోబస్తు మధ్య నాగబాబు పర్యటన సాగించారు. టిడిపి శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకుంటున్నారు.

అరకు కాఫీ ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం పట్టణంలోని బెలగాంలో ఐటిడిఎ పెట్రోల్ బంక్ వద్ద అరకు కాఫీ పాయింట్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు పిఒ కాఫీ దుకాణాన్ని సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. గతంలో పెట్రోల్ బంకు వద్ద అరకు కాఫీ విక్రయాలు జరిగేవని, అనివార్య కారణాల వల్ల కొన్ని రోజులు మూసివేయడం జరిగిందన్నారు. దీన్ని తిరిగి ప్రారంభించేందుకు జిల్లా ప్రజలందరికీ అరకు కాఫీ రుచులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమగు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధింత అధికారులను ఆయన ఆదేశించారు. అవసరమైతే కాఫీ తయారీలో మంచి శిక్షణ అందించి అరకు కాఫీ ప్రాచుర్యం మరింత పెరిగేలా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ ఎ మురళీధర్, సహాయ గణాంక అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రజాశక్తి మాజీ సబ్ ఎడిటర్ రాజశేఖర్ మృతి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజాశక్తి మాజీ సబ్ ఎడిటర్ మెట్ట రాజశేఖర్ (46) శనివారం గుండెపోటుతో మరణించారు. ఉదయం 7.30 గంటల సమయంలో తన భార్య నిద్రలేపేసరికి ఆయన అచేతన స్థితిలో ఉండడంతో వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజశేఖర్ విజయనగరం, శ్రీకాకుళం డెస్క్‌ల్లో సుదీర్ఘకాలంపాటు పని చేశారు. తరువాత కొంతకాలం సత్యావిజన్ అనే స్థానిక పత్రికలో పని చేశారు. ఏడాది క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. చికిత్స అనంతరం తన పనులు తాను చేసుకుంటున్న సమయంలో ఆకస్మాతుగా మృతి చెందారు. ఆయనకు తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్ మృతదేహాన్ని ప్రజాశక్తి విజయనగరం మేనేజర్ సిహెచ్ రాము, డెస్క్ ఇన్‌ఛార్జి పి.అప్పారావు, స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు, సబ్ ఎడిటర్ కె.కృష్ణమూర్తి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. రాజశేఖర్ మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై అచ్యుతరావు, బుక్‌హౌస్ ఎడిటర్ ఎంవిఎస్ శర్మ సంతాపం తెలిపారు.

రాష్ట్రాన్ని అమ్మడమే విజన్-47 ధ్యేయం

- సెమినార్‌లో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సెమినార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ , చిత్రంలో ద్రవిడ యూనివర్శిటీ పూర్వ వైస్‌ఛాన్సలర్ కెఎస్ చలం తదితరులు

విజన్-47 ద్వారా రాష్ట్రాన్ని అమ్మేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలను చీకట్లో పెట్టి రాష్ట్ర సంపదను పెట్టుబడిదారులకు కట్టబెట్టడం తప్ప ఇంకొకటికాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. 'విజయనగరం సమగ్రాభివృద్ధి - అవసరాలు - అవకాశాలు' అనే అంశంపై విజయనగరంలోని జడ్‌పి సమావేశ మందిరంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వక్తలు మాట్లాడారు. 'విజన్ 2047-పరిశీలన' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. దేశంలో నయా ఉదారవాద విధానాలు అమలవుతున్నంత కాలం ఏ ప్రాంతమూ అభివృద్ధి కాదని తెలిపారు. ప్రజలను రాజకీయాలకు దూరంగా ఉంచడమే వెనుకబాటుకు కారణమన్నారు. సంపదను కొల్లగొట్టడమే దీని లక్ష్యమని వివరించారు. ప్రభుత్వ పరిశ్రమలు మూసేసి, ప్రభుత్వ రంగాలను ప్రయివేటు సంస్థలకు అప్పగించి, ఉపాధి అవకాశాలు కల్పించకుండా చేస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. 2047 విజన్ అంటే అదానికీ దేశాన్ని దోచిపెట్టడం, పేదలను కొల్లగొట్టి కార్పొరేట్లను అభివృద్ధి చేయడం తప్ప మరొకటి కాదన్నారు. 'నీ భూమి నీకు కాకుండా పోవడమే పి4 విధానం' అని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులు, రాష్ట్రాన్ని అమ్మేయకుండా ప్రజలు కాపాడుకోవాలని కోరారు. అభివృద్ధి-ప్రాధాన్యతపై ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్ చలం మాట్లాడుతూ.. మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు ప్రధానిని అందించిన ఈ నేల కేవలం రాజకీయ నాయకుల కారణగానే అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను రాజకీయ తాబేదార్ల అమ్మేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతం పట్ల ప్రభుత్వాల చిన్న చూపు కారణంగానే అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో సాంస్కృతిక రంగం ప్రాధాన్యతపై ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, నీటి వనరులు-అవసరాలు-అవకాశాలు అనే అంశంపై డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జివిఎస్ జయపాల్‌రావు, ఎన్ఇపి నేపథ్యంలో విద్యారంగంపై యుటిఎఫ్ విద్యా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.రాము, పర్యావరణం-ఆరోగ్య వ్యవస్థపై డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎస్.అప్పలనాయుడు, ప్రముఖ కథారచయిత గంటేడ గౌరినాయుడు ఉపన్యశించారు. తొలుత బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి వక్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్టును బలహీనపరిచే చర్యలు ఆపండి

- కేంద్రానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థలైన వైజాగ్ స్టీల్ ప్లాంట్, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ (విపిటి)లను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ కేంద్రానికి శనివారం లేఖ రాశారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామికి ఆ లేఖను పంపారు. ఫిబ్రవరిలో ఆర్ఐఎన్ఎల్ (వైజాగ్ స్టీల్‌ప్లాంట్)ను రివైవల్ చేస్తున్నట్లు రూ.11440 కోట్ల ప్యాకేజీ ఇచ్చి.. అదే సమయంలో ఆర్సెలార్ మిట్టల్ ప్రయివేట్ స్టీల్‌ప్లాంట్‌ను స్థాపించడానికి, గనులు సమకూర్చడానికి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్ర స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేయడం వంటి వార్తలు పత్రికల్లో వస్తున్నాయని, ఇది ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడంలేదని చెబుతూనే మరో ప్రయివేట్ స్టీల్ ప్లాంట్ కోసం ఇంత కృషి చేయడం తగునా ? అంటూ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని ఎన్‌డిఎతో చెలిమి చేసి ఆర్ఐఎన్ఎల్‌ను, విశాఖ పోర్టు తాలూకా ఆపరేషన్స్‌ను బలహీనపరిచేలా వ్యవహరిస్తోందని గతంలో తాను రాసిన లేఖల్లో స్పష్టంగా వివరాలతో తెలియజేసినట్లు శర్మ ఉటంకించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటి) సామర్థ్యంతో మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు అత్యంత సమీపంలో ఏర్పాటు చేసే చర్యలను విడనాడాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఒక అడుగు ముందుకేస్తూ 2.9 కిలో మీటర్ల వాటర్ ఫ్రంట్‌ను ఆర్సెలార్ మిట్టల్‌కు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. నక్కపల్లిలోని డిఎల్.పురం వద్ద కేప్టివ్ పోర్టుకు స్థలాన్ని కేటాయిస్తున్నట్లు చెప్పడం ఎంత వరకూ సమంజసమన్నారు. ప్రభుత్వ నీటి వనరులను ఎలా ప్రయివేట్‌కు ఇస్తారని ప్రశ్నించారు. పై రెండు చర్యల ద్వారా ప్రభుత్వ స్టీల్‌ప్లాంట్‌కు, వైజాగ్ పోర్టుకు నష్టం జరుగుతుందని శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేసే పనులను నిలుపుదల చేసి రూ.30 వేల కోట్ల అప్పుల్లో ఉన్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోలుకునేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గనిలో డిటోనేటర్ల పేలుడు

- నలుగురు కార్మికులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి సమీపంలోని విజయరంగ మైనింగ్ పరిశ్రమలో శనివారం ఉదయం డిటోనేటర్ పేలింది. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... విజయరంగ మైనింగ్ పరిశ్రమలో కొండపల్లి గ్రామానికి చెందిన తిరుపాలు, యాడికి మండలం తూట్రాలపల్లికి చెందిన హరికృష్ణ, నాగయ్య, రామరాజుపల్లికి చెందిన మంగల కొండన్నలు కార్మికులుగా పని చేస్తున్నారు. రోజు మాదిరే శనివారం ఉదయం నలుగురు కార్మికులు భూగర్భగనుల్లో రాయిని తవ్వడానికి వెళ్లారు. గతంలో గనిలో అమర్చిన పేలుడు పదార్థం పేలకపోవడంతో వాటిని వదిలేశారు. శనివారం నాడు ఆ ప్రాంతంలో కొత్తగా డిటోనేటర్లు పెట్టేందుకు రంధ్రాలు ఏర్పాటు చేస్తున్న సమయంలో గతంలో అమర్చిన డిటోనేటర్లు ఆకస్మాత్తుగా పేలాయి. దీంతో అక్కడున్న నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో యాజమాన్యం గనిలో వారిని రోప్ వే ద్వారా బయటకు తీసుకొచ్చింది. ప్రాథమిక చికిత్స నిమిత్తం యాడికిలోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామసుబ్బయ్య తెలిపారు.

పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు పెన్షనర్లకు ఉరితాడు

- సదస్సులో యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం)

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు పెన్షనర్లకు ఉరితాడు లాంటిదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె విజయగౌరి ఆదోళన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు భద్రత లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ రూల్స్ సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన 'భారత్‌లో పెన్షనర్లకు బిగిస్తున్న ఉరితాడు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ సామాజిక భద్రత లేని చట్టాన్ని ఆమోదించి ఉద్యోగులకు తీరని నష్టం చేశారన్నారు. 2026 ముందు రిటైర్ అయిన ఏ ఉద్యోగికీ పిఆర్‌సిలు, డిఎలు వర్తించకుండా చేసే ఈ చట్టాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1972 నుండి అమలు జరుగుతున్న సామాజిక భద్రతకు సంబంధించిన పెన్షన్ రూల్స్ మాయమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు 1.5 లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చాయన్నారు. ఇటువంటి కేంద్ర ప్రభుత్వ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అమలు చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకమే దానికి ఉదాహరణ అని అన్నారు. ఇప్పుడు అందరికీ ఏ గ్యారెంటీ లేని పెన్షన్ మిగలనుందని, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు కేంద్రప్రభుత్వ నూతన పెన్షన్ చట్టాన్ని తిప్పి కొట్టడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డి కృష్ణమూర్తి, పిడి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్ నాయుడు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి వెంకటనాయుడు, కేశవరావు, రామకృష్ణ, మధు, బొబ్బిలి నియోజకవర్గం మండలాలు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇఎస్ఐతో కార్మికుల ఆరోగ్యానికి రక్ష

- ఇఎస్ఐ గుణదల సూపరింటెండెంట్ జ్యోతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్మికులకు ఆరోగ్య పరంగా ఎటువంటి వైద్య సౌకర్యమైనా అందించడంతోపాటు పూర్తి రక్షణ కల్పించే ఏకైక బీమా పథకం కార్మిక రాజ్య బీమా (ఇఎస్ఐ) అని ఇఎస్ఐ గుణదల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వజ్రా జ్యోతి పేర్కొన్నారు. గుణదల ఇఎస్ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఎపియుడబ్ల్యుజె విజయవాడ యూనిట్, ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన శనివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు, నాన్ జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభోత్సవ సభకు ఎపియుడబ్ల్యుజె అధ్యక్షులు చావా రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ఇఎస్ఐ వర్తించే సంస్థలో పనిచేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంస్థలో చేరిన రోజు నుంచే వైద్య సౌకర్యం పొందేందుకు అర్హులవుతారని, ఈ పథకం కింద బీమా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పూర్తి వైద్యసాయం పొందుతారన్నారు. అవసరాన్ని బట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో కూడా వైద్య సేవలు కల్పిస్తారన్నారు. కార్మికులు పనిచేస్తుండగా అస్వస్థతకు, ప్రమాదాలకు గురైనప్పుడు వారు చెల్లించిన చందాతో నిమిత్తం లేకుండా వైద్య సదుపాయం కల్పిస్తామని, ఈ సదుపాయాన్ని పొందేందుకు ఎటువంటి పరిమితి లేదన్నారు. కొన్ని యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అర్హులైన సిబ్బంది అందరికీ ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని, అప్పుడే ఈ పథకం లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఇఎస్ఐ గుణదల ఆస్పత్రి జనరల్ మెడిసిన్, సర్జికల్, గైనకాలజీ, గుండె వైద్య విభాగాల నిపుణులు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్, కామినేని హాస్పిటల్, అమరావతి నేత్ర వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. ఇఎస్ఐ ఆస్పత్రి తరపున మందులు ఉచితంగా రోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ సమితి సభ్యులు షేక్ బాబు, ఎపియుడబ్ల్యుజె విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచెల జయరాజ్, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అఘోరీ చెర నుండి బయటపడ్డ శ్రీవర్షిణి

- గుజరాత్ పోలీసుల రక్షణలో మంగళగిరికి రాక

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

వివాదాస్పద లేడీ అఘోరీ చెర నుంచి మంగళగిరి అమ్మాయి శ్రీ వర్షిణిని గుజరాత్ పోలీసులు విడిపించారు. గత మార్చి నెలలో మంగళగిరిలో శ్రీ వర్షిణీ తల్లిదండ్రుల ఇంట్లో బస చేసిన లేడీ అఘోరీ మాయమాటలు చెప్పి శ్రీవర్షిణిని లోబరుచుకున్నారు. అనంతరం ఆమెను గుజరాత్‌కు తీసుకెళ్లారు. గత నెల రోజులుగా శ్రీవర్షిణి అఘోరీతో కలిసి ఉంటున్నారు. తమ కూతురుకి మాయమాటలు చెప్పి లేడీ అఘోరి ఎత్తుకెళ్లిందని శ్రీవర్షిణి తల్లిదండ్రులు మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. శ్రీవర్షిణితో గుజరాత్‌లో అఘోరి ఉందని తెలుసుకున్న పోలీసులు అక్కడి పోలీసులను సంప్రదించారు. తొలుత శ్రీవర్షిణి మేజర్ అని బుకాయించిన అఘోరీ శుక్రవారం గుజరాత్ పోలీసులకు చుక్కలు చూపే ప్రయత్నం చేసింది. గుజరాత్ పోలీసులు తమ స్టైల్‌లో విచారణ చేయడంతో అఘోరీ లొంగిపోయింది. అఘోరీని అదుపులోకి తీసుకున్న గుజరాత్ పోలీసులు శనివారం శ్రీవర్షిణీ ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడ నుండి శ్రీవర్షిణిని మంగళగిరికి తీసుకువస్తున్నారు.

బ్యాట్‌రెతో ఇవి91 భాగస్వామ్యం

బెంగళూరు : బి2బి వాహన ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ బ్యాట్‌రేతో విద్యుత్ వాహనాల అగ్రిగేటర్ ఇవి91 టెక్నాలజీస్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. సంయుక్తంగా 10,000 ఇవిలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించాయి. తద్వారా పట్టణ, గ్రామీణ రవాణ రెండింటి భవిష్యత్తును పునర్నిర్వచించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాయి. అత్యున్నత స్థాయి ఇవి స్కూటర్లను అందించడమే తమ లక్ష్యమని బ్యాట్‌రే వ్యవస్థాపకుడు, ఎండి నిశ్చల్ చౌదరి పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా మరిన్ని ఇవిలను రోడ్డుపైకి తీసుకురావడం సహాయపడుతుందని ఇవి 91 వ్యవస్థాపకుడు, సిఇఒ అరుణ్ కుమార్ తెలిపారు.

ఐటిసి ఆశీర్వాద్ మసాలాలకు నాని ప్రచారం

హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఐటిసి లిమిటెడ్ తన ఆశీర్వాద్ మసాలలు బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు నానీని నియమించుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఆయన ప్రచారాన్ని ఉపయోగించుకోనున్నట్లు ఐటిసి లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పియూష్ మిశ్రా పేర్కొన్నారు. మసాలాల విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు వెల్లడించారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్టు

- రూ.1.10 లక్షల విలువ చేసే గంజాయి, ఎమ్‌డిఎంఎ ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయించే ముఠాలో నలుగురిని గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎఎస్‌పి రవికుమార్ వెల్లడించిన వివరాల మేరకు... విజయవాడ కృష్ణలంకకు చెందిన నందం నిఖిల్, సాయికుమార్, రాణిగారితోటకు చెందిన బొట్ల వెంకట కాశి వర్ధన్, తాడేపల్లిలోని కుంచనపల్లికి చెందిన గిరీష్‌రెడ్డి, సాహెబ్, శ్యామ్ గంజాయి ఎండిఎంఎ ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. మంగళగిరి మండలం ఎర్రబాలెంలోని ఓ హోటల్ వద్ద వారంతా గంజాయి, ఎండిఎంఎ ప్యాకెట్లను విక్రయిస్తుండగా సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. సాహెబ్, శ్యామ్ పరారవ్వగా మిగతా నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుండి 1.2 కిలోల గంజాయి, 8.71 గ్రాముల ఎండిఎంఎ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.1.10 లక్షలుంటుందని ఎఎస్‌పి తెలిపారు.

హ్యావ్‌మోర్ కొత్త క్యాంపెయిన్

హైదరాబాద్ : ప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్లలో ఒక్కటైన లాట్టే వెల్‌ఫుడ్ కంపెనీలో భాగమైన హ్యావ్‌మోర్ కొత్త ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. క్రికెటర్ హర్థిక్ పాండ్యాతో కలిసి నటీ తమన్నా భాటియా నూతన ప్రచారంలో పాల్గొనన్నారని పేర్కొంది. 'సో టేస్టీ యు వన్నా మోర్' నినాధంతో హ్యావ్‌మోర్ క్యాంపెయిన్ సాగనుందని వెల్లడించింది.

థామస్‌కుక్‌తో జాగల్ జట్టు

హైదరాబాద్ : ప్రయాణ, వ్యయ నిర్వహణ పరిష్కారాల సంస్థ థామస్‌కుక్ ఇండియాతో భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ తెలిపింది. థామస్‌కుక్ కార్పొరేట్ ట్రావెల్, వ్యయాల నిర్వహణలో డిజిటల్ పరివర్తనకు ఈ ఒప్పందం మద్దతు చేయనుందని జాగల్ సిఇఒ, ఎండి అవినాష్ గోడ్‌కింది పేర్కొన్నారు. కార్పొరేట్ ట్రావెల్‌ను మరింత స్మార్ట్‌గా, సామార్థ్యంగా మార్చడానికి టెక్నాలజీని అందించనున్నామన్నారు.

జెకెఎఎస్ అధికారుల బదిలీలపై ముదురుతున్న వివాదం

- కేంద్రానికి ఒమర్ అబ్దుల్లా లేఖ

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ పరిపాలనా సర్వీస్ (జెకెఎఎస్)కు చెందిన 48 మంది అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) మనోజ్ సిన్హా బదిలీ చేయడం మరింత వివాదాస్పదంగా మారింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే రాజ్‌భవన్, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న విభేదాలకు ఇది ఆజ్యం పోసినట్లయింది. బదిలీల విషయాన్ని తీసుకుంటున్న ముఖ్యమంత్రి అబ్దుల్లా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఎల్‌జి సిన్హా, చీఫ్ సెక్రటరీ అటల్ దుల్లూకు లేఖలు రాశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వ అధికారాన్ని కాదని ఎల్‌జి జారీ చేసిన ఉత్తర్వులకు ఎలాంటి చట్టబద్ధత లేదని అందులో పేర్కొన్నారు. ట్రాన్సాక్షన్ ఆఫ్ బిజినెస్ రూల్స్ వెంటనే ఖరారు చేయాలని కోరారు. అధికారులను ఏకపక్షంగా బదిలీ చేయడంపై సమీక్ష చేపట్టాలని ఎల్‌జికి రాసిన లేఖలో ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

అలాగే, ముఖ్యమంత్రి అనుమతి లేకుండా అఖిల భారత సర్వీసేతర అధికారులను బదిలీ చేయవద్దని చీఫ్ సెక్రటరీని కోరారు. జమ్మూకాశ్మీర్‌లో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అమిత్ షా పర్యటన వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ కూడా స్పందించింది. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కాదని, ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని అమిత్‌షాకు అసెంబ్లీలో కాంగ్రెస్ చీఫ్ విప్ నిజాముద్దీన్ భట్ కోరారు.

స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకం

ప్రజాశక్తి అమరావతి

రాష్ట్ర హైకోర్టులో పలు కార్పొరేషన్ల తరపున వాదనలు వినిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్స్‌ను నియమించింది. న్యాయవాదులను ఆయా కార్పొరేషన్ల తరపున వాదనలు వినిపించేందుకు స్టాండింగ్ కౌన్సిల్స్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా ఆయా పోస్టుల్లో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఎపి ఎమ్‌డిసి) స్టాండింగ్ కౌన్సిల్‌గా నందం జీవన్ కుమార్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) స్టాండింగ్ కౌన్సిల్‌గా కె కళ్యాణ దుర్గాప్రసాద్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా మహ్మద్ సలీం, ఎపి ఎస్‌సి కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా గండ్రాల రత్నకుమార్, ఎపి విత్తనాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎవి కొండయ్య నియమితులయ్యారు.

సవరణల వల్లే వక్ఫ్ బిల్లుకు మద్దతు

- సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : టిడిపి సూచించిన విధంగా మూడు సవరణలు చేయడం వల్లే వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు పార్టీ లోక్‌సభలో, రాజ్యసభలో అనుకూలంగా ఓటువేసిందని సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి తెలిపారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిల్లులో తొలుత సవరణలు ప్రతిపాదించింది తెలుగుదేశం పార్టీనే అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ భూములన్నీ యథాస్థితిలోనే ఉంటాయని, కలెక్టర్ స్థాయికి మించిన ర్యాంక్ ఉన్న అధికారిని నియమించి వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తారన్నారు. ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డులో చోటు ఇవ్వకూడదని ప్రతిపాదించామన్నారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకమని చెప్పి రాజ్యసభలో అనుకూలంగా వైసిపి ఓటు వేసిందన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

అయోధ్యనగర్ బ్రాంచి (64070),
డోర్ నెం 18-1-34, ప్రభాస్ కాలేజ్ బిల్డింగ్, సికె రెడ్డి రోడ్,
కేదారేశ్వర పేట, విజయవాడ-520003, ఎన్టీఆర్ జిల్లా.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రెండవ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **అయోధ్యనగర్ బ్రాంచి (64070)** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: 1. మెస్సర్స్ అంబ వారాహి ఆటో మోటివ్స్. 2. తెల్లాకుల వెంకట రామ సుధీర్,** తండ్రి: టి. లక్ష్మీనారాయణ. **3. మోటకట్ల వరలక్ష్మి,** భర్త: (లేట్) ఎం. రాఘవ రెడ్డి మరియు **హామీదారు: మోటకట్ల రోహిణి,** తండ్రి: (లేట్) ఎం రాఘవ రెడ్డి. గారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.1,02,08,944.81** (అక్షరాలా ఒక కోటి రెండు లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయల ఎనభై ఒక్క పైసలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేదీ. 02-01-2025న** డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 8 ప్రకారము **తేది.02-04-2025**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **అయోధ్యనగర్ బ్రాంచి (64070)** వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.1,02,08,944.81** (అక్షరాలా ఒక కోటి రెండు లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల నలభై నాలుగు రూపాయల ఎనభై ఒక్క పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

విజయవాడ-520012, భవానీపురం, కొండవీడు కళ్యాణమండపం పక్కన రోడ్డు, టీచర్స్ కాలనీ, ఆర్.ఎస్.నెం.44/2, ప్లాట్ నెం.12, డోర్.నెం.76-14-226/బి లో 133 చ.గ.లలో ఆర్.సి.సి రూఫ్డ్ కమర్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు నివాస మొదటి అంతస్తు మరియు ఏసిసి షీట్ రూఫ్డ్ రెండవ అంతస్తు గల ఆస్తి శ్రీమతి మోటకట్ల వరలక్ష్మి, భర్త: (లేట్) ఎం.రాఘవ రెడ్డి సాహెబ్ గారి పేరున కలదు. (రిజిస్టర్ గిఫ్ట్ డీడ్ నెం. 63257/2024, తేది: 30.03.2024 మరియు రిజిస్టర్ సేల్ డీడ్ నెం. 8395/2002, తేది: 30.01.2002) **హద్దులు: ఉత్తరం:** 30 అడుగుల వెడల్పు గల మున్సిపల్ రోడ్డు, **దక్షిణం:** నందూరు త్రినాధశర్మ మరియు నందూరు మురళీ కృష్ణ గారి ఆస్తి, **తూర్పు:** టి. రాజా గారి ఆస్తి, **పడమర:** సమ్మిమిరెడ్డి లక్ష్మీ శివ గారి ఆస్తి.

తేది: 02-04-2025 — అధీకృత అధికారి
ప్రదేశము: విజయవాడ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

సూర్యరావుపేట బ్రాంచి
డి.నెం.29-19-73,
డోర్నకల్ రోడ్డు, విజయవాడ.

డిమాండ్ నోటీసు

Notice under Sec.13 (2) read with Sec.13 (3) of Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/కో-ఆబ్లిగెంట్(లు)/హామీదారు(లు): ఋణగ్రహీతలు: 1. మెస్సర్స్ కెపి అపెరల్ మర్చండైజింగ్, రిజిస్టర్డ్ చిరునామా: ప్లాట్ నెం. 71, 3వ క్రాస్, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520010. యూనిట్ చిరునామా: 12-65, డ్రైవర్‌పేట, అక్షయ సూపర్ మార్కెట్ ఎదురుగా, పోరంకి, పెనమలూరు సెంటర్, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521137. **2. శ్రీ కాసరనేని కృష్ణ ప్రసాద్,** తండ్రి: కె.బలరామకృష్ణ, ప్రొప్రయిటర్ ఆఫ్ మెస్సర్స్ కెపి అపెరల్ మర్చండైజింగ్, 40 9 0107, రమేష్ హాస్పిటల్ ఎదురుగా, సాయి నగర్, విజయవాడ-520010. క్రెడిట్ కార్డ్ చిరునామా: నెం-426, 3వ క్రాస్ 1వ స్టేజ్, శ్రీ కృష్ణ గుడి రోడ్డు, ఇందిరా నగర్, బెంగళూరు-560038. **హామీదారులు: 1. కె. బలరామకృష్ణ (మరణించిన)** అతను చనిపోయినందున, అతని చట్టపరమైన వారసులు **1. శ్రీ. కాసరనేని కృష్ణ ప్రసాద్,** తండ్రి: లేట్ కాసరనేని బలరామకృష్ణ, ప్లాట్ నెం: 28, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520010. **2. శ్రీమతి కొడాలి కుముధవల్లి,** తండ్రి: లేట్ కె.బలరామకృష్ణ, భర్త: కొడాలి కృష్ణ ప్రసాద్, ప్లాట్ నెం. 71, 3వ క్రాస్, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520010.

నేచర్ ఆఫ్ లిమిట్	ఎన్.పి.ఎ తేది నాటికి అంటే 19.01.2025 బకాయి మొత్తం	20.01.2025 నుండి 25.03.2025 వరకు వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (సరళమైనది)	బ్యాంక్ చేసిన ఖర్చు, ఛార్జీలు	25.03.2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
TL -052316050000002	Rs.5,56,884/-	Rs.28,637/-	2%	Rs.2655/-	Rs.5,87,176/-
CC-052315010000002	Rs.7,19,935/-	Rs.19,354/-	2%	0	Rs.7,39,289/-
UNCLS - 052316590000068	Rs.49,878/-	Rs.745/-	2%	0	Rs.50,623/-
మొత్తం					Rs.13,77,088/-

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, మద్దూరు గ్రామం పంచాయితీ, కాసరనేనివారిపాలెం గ్రామం, మద్దూరు శివారు, ఆర్.ఎస్.నెం.35/3, సమీప డోర్.నెం.2-5లో మొత్తం ఎకరా 0.33 సెంట్లలలో ఎకరా 0.30 సెంట్ల దక్షిణం వైపున 726 చ.గ.లు లేదా 607 చ.మీ.లలో గల ఖాళీ నివాస స్థలం లేట్ కె.బలరామ కృష్ణ గారికి చెందినది. **హద్దులు: తూర్పు:** కాసరనేని వెంకటేశ్వరరావు గారి భూమి, **దక్షిణం:** దమ్మలపాటి సుబ్బారావు గారి ఇల్లు, **పడమర:** పంచాయితీ బజారు, **ఉత్తరం:** ఇతరుల ఆస్తి.

గమనిక: మీలో నెం.2. (శ్రీ కాసరనేని కృష్ణ ప్రసాద్) మా బ్యాంక్ నుండి **రూ.1,00,000/-** పరిమితి గల **కార్డ్ నెంబర్ 10305613** కలిగిన క్రెడిట్ కార్డ్ సౌకర్యాన్ని పొందారు. క్రెడిట్ కార్డ్ కూడా **ది.16.03.2022**న ఎన్.పి.ఏ అయింది, కావున **ది.24.03.2025** నాటికి మొత్తం **రూ.2,00,067/-** బకాయిలు ఉన్నాయి. క్రెడిట్ కార్డ్ బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయబడకపోతే, పైన పేర్కొన్న ఖాతాలను తిరిగి చెల్లించినట్లయితే, వాటిని పనితీరు ఆస్తులుగా వర్గీకరించలేమని దయచేసి గమనించండి. అందువల్ల, మీరు పైన పేర్కొన్న ఖాతాల బకాయిలతో పాటు క్రెడిట్ కార్డ్ బకాయిలను కూడా చెల్లింపు చేయాలి.

గౌరవనీయులైన సర్/మేడమ్

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి-నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు చెల్లించవలసిన లోన్ అకౌంట్స్ క్రింద మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యరావుపేట** బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.19-01-2025**న నిరర్థక ఆస్తిగా **(NPA)** వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు **ది. 25-03-2025** నాటికి మొత్తము **రూ. 13,77,088/- (అక్షరాలా పదమూడు లక్షల డెబ్బై ఏడు వేల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే).** అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము /డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

గమనిక: తేది: 01.02.2025 నాటి మునుపటి నోటీసు ఉపసంహరించబడిందని మేము మీ దృష్టికి తీసుకువస్తున్నాము.

తేది : 25-03-2025 — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సంపాదకీయం

నీటి విలాపం

'నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడిపోతాం/ నీటితనంలో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు ప్రొ.ఎన్.గోపి. కాల్వలై, వాగులై, వంకలై, నదులై, సముద్రాలై భూమిని జలచర్మధారిణిగా మార్చేసింది నీరు. కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయంటారు పెద్దలు. వాడుకోవడమే తప్ప చుక్క నీటిని కూడా పొదుపు చేయలేని మనం... తోడుతూపోతే భూగర్భం మొత్తం ఖాళీ అయిపోతుంది. భూమిపై లభ్యమయ్యే మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్ర జలం. ఇది భూప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచురూపంలో వుంది. ఇక మిగిలిన ఒక శాతంగా తక్కువగా వున్న మంచినీరు మాత్రమే ప్రాణులకు పనికొచ్చేది. సకల జీవరాసులకు ప్రాణాధారమైన నీరు...గాలితో పాటు భూమిపై అత్యంత విస్తారంగా లభించే సహజ వనరు. ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. పెరుగుతున్న జనాభా, పర్యావరణ కాలుష్యంతో మంచినీటికి గడ్డుకాలం ఏర్పడింది. కార్పొరేట్ సంస్థలు ఈ పరిస్థితిని ఉపయోగించుకొని, నీటిని సరుకుగా మార్చేశాయి. ప్రాణాధారమైన నీటిని ప్రైవేట్‌పరం చేసే ప్రక్రియ 1990లలో మొదలైనా...అదిప్పుడు వేగంగా ప్రపంచమంతా పాకుతోంది. తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడుతోంది.

గుక్కెడు నీళ్లు దొరక్క గొంతెండిపోయే పల్లెలు, దాహం తీర్చుకోడానికి డబ్బాలు, బిందెలు పట్టుకుని చెలమలు, బావుల వెంట పరుగులెత్తే జనాలు... సాగునీటి కోసం అష్టకష్టాలు పడే రైతులు... వికసిత్ భారత్‌లో నిత్యం పత్రికల్లో కనిపించే వాస్తవిక దృశ్యాలు. వేసవి ప్రారంభంలోనే రాష్ట్రంలో నీటి సంక్షోభం మొదలైంది. అనేక జిల్లాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. అవసరానికి మించిన నీటి వినియోగంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. 'రాష్ట్రంలో 2,617 గ్రామాల్లో భూగర్భ జలాలు తక్కువగా వున్నాయని, వీటిలో దాదాపు 300 గ్రామాల్లో నీటిని ప్రమాదభరితంగా తోడేస్తున్నారని' ఇటీవల కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. కాగా, రాష్ట్రంలోని 679 మండలాల్లో 332 మండలాలు నీటికొరతను ఎదుర్కొంటున్నాయి రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మండలాల పరిధిలోని 3,549 నివాస ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటారనీ ప్రభుత్వం తేల్చింది. అయితే, నీటి ఎద్దడి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ ఇప్పటివరకూ పూర్తికాలేదు. 'నీటికొరత ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశం. కానీ, భారత్ వంటి దేశాల్లో... లక్షలాది మందిని ప్రభావితం చేసే రోజువారీ సంక్షోభం' అంటారు మాజీ ఐరాస ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్. నీటికి మీటర్లు పెట్టి కొలిచే పిదపకాలం దాపురించింది.

ఒకప్పుడు చెరువులు, వాగులు, వంకల్లో నీళ్లు వాడుకునేవారు. ఇప్పుడివేవీ కనిపించవు. పశువులు తాగడానికి కూడా చెరువుల్లో నీళ్లు లేవు. కొన్నిచోట్ల చెరువులే మాయమైపోయాయి. నీటిని సంరక్షించుకోకపోతే మనిషి మనుగడకే ముప్పు. ఇది ఒక్క భారత్‌కే పరిమితమైన సమస్య కాదు. 2050 నాటికి ప్రపంచంలో చాలా భాగం తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోనుందని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం చెబుతోంది. నీతి అయోగ్ నివేదిక ప్రకారం...2030 నాటికి 40 శాతం మంది భారతీయులకు తాగునీరు అందుబాటులో వుండదు. 'జ్ఞానం వికసించిన జలతీరాల్లో/ వాణిజ్యం పడగవిప్పింది/ మితిమీరిన వాణిజ్యదాహం/ నీటి ప్రాణాన్ని బలిగొంటున్నది' అంటారు ఎన్.గోపి 'జలగీతం'లో. నీటివ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. బడా కంపెనీలు లాభాలార్జిస్తుండగా, ప్రజలకు, పర్యావరణానికి తీవ్రనష్టం కలుగుతోంది. ప్రజలకు తాగు, సాగు నీటిని అందించాల్సిన ప్రభుత్వాలు.. అందుకవసరమైన చర్యలు తీసుకోకపోగా, భూగర్భ జలాలను తోడేస్తున్న కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్నాయి. వేసవి వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాక... భూగర్భ జలాలను సంరక్షించడం, నీటిని పొదుపు చేయడం వంటి తక్షణావసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. చెరువులు, వాగులు, వంకలు, నదులు, సముద్రాల వంటి సహజవనరులను పరిరక్షించుకోవాలి. నీటి విలాపాన్ని నివారించాలి.

మహనీయుల మాట

భారత కార్మికోద్యమ నిర్మాత బి.టి. రణదివే వర్థంతి



ప్రస్తుత రాజకీయ ఆర్థిక వ్యవస్థ...కుల, వర్గ దోపిడీని కాపాడే ఆస్తి సంబంధాలపై ఆధారపడి వున్నది. భూస్వాములు, గుత్త పెట్టుబడిదారులు ఆర్థిక వ్యవస్థను అదుపు చేస్తూ...బూర్జువా భూస్వామ్య ప్రభుత్వం అధికారంలో కొనసాగు తున్నప్పుడు... అంటరానితనాన్ని, కులాన్ని నిర్మూలించవచ్చునని చెప్పడం కేవలం మోసం.

జననం : 19.12.1904

మరణం : 6.4.1990

వక్ఫ్ బిల్ టు నాగపూర్...వివాదాల పరివార్!

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ప్రధాన మంత్రి పదవి చేపట్టిన తర్వాత పదకొండేళ్లకు అంటే మార్చి30న నాగపూర్ లోని ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయాన్ని నరేంద్ర మోడీ సందర్శించటం జాతీయ స్థాయిలో కచ్చితమైన రాజకీయ సంకేతాలు ఇచ్చింది. ఔరంగజేబు సమాధికి సంబంధించి నాగపూర్‌లో అల్లర్లు జరగటం, పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ఆమోదం, కాశీ మధుర మసీదు మందిర వివాదాలలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొనవచ్చునని దాని కీలక ద్వితీయ నాయకుడైన దత్తాత్రేయ హోసబ్లే కాషాయ జెండా ఊపడం ఒక వరుస లోవే. త్వరలో జరిగే బీహార్, యుపి, గుజరాత్, బెంగాల్, కేరళ ఎన్నికలకు ముందు బిజెపి సంఘ పరివార్ హిందుత్వ ఎజెండాను ఉధృతం చేయబోతున్న సూచనలే.

పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు మీద జరిగిన హోరాహోరీ పోరాటం ఒక విషయాన్ని స్పష్టం చేసింది. రాజ్యాంగం 25 నుంచి 28 అధికరణాల వరకు మత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాథమిక హక్కులపై దాడిగా ప్రతిపక్షాలు ఈ బిల్లును అభివర్ణించాయి. అయితే హోం మంత్రి అమిత్ షా, బిల్లును ప్రతిపాదించిన న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు మాత్రం ఇదేదో పేద ముస్లింలకు మేలు చేయడానికి తెచ్చినట్టు గొప్పలు పోయారు కానీ వారి భాష, ఇచ్చిన ఉదాహరణలు చూస్తే రాజకీయ కోణం స్పష్టమవుతుంది. ఈ పార్లమెంటు భవనం కూడా వక్ఫ్ కిందకే వస్తుందని వారు వాదిస్తారని రిజుజు ముస్లింలను ఉద్దేశించి అన్నారు. చర్చను కాంగ్రెస్ వైపు మళ్లించి 2014 ఎన్నికలకు ముందు ఆ పార్టీ వేలాది ఆస్తులను కట్టబెట్టిందని ఆరోపించారు. దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ. ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు ఎవరైనా భారతీయులేనన్న రాజ్యాంగ స్ఫూహను దెబ్బ తీసేలా ముస్లిం సంస్థల ఆస్తులు వశపరచుకోవటం పెద్ద విజయం లాగా చూపించటం ఎన్నికల లబ్ధి కోసమే. వక్ఫ్ బోర్డులోని 22 మంది సభ్యులలో నలుగురు ముస్లిమేతరులు ఉండాలని నిర్ణయించటం నిస్సందేహంగా వారి మత భావాలను దెబ్బతీసే అంశం అవుతుంది. ఒకవైపున తిరుపతిలో అన్య మత ఉద్యోగులను కూడా తొలగించాలంటున్న తీరుకు ఇది పూర్తి విరుద్ధం. దేవాలయాలను పూర్తిగా మత సంస్థలకు అప్పగించాలంటూ ఇటీవల విజయవాడలోనే భారీ సమీకరణ జరపటం కూడా చూశాం. రాజ్యాంగం మైనారిటీ మతాలకు ప్రత్యేక రక్షణ కల్పించడం, ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యత గుర్తించడం, దేశ సమైక్యతను కాపాడుకోవడం కోసమే. కుల, మత, లింగ వివక్ష లేకుండా పౌరులందరూ సమాన హక్కులు కలిగి ఉండటం ప్రజాస్వామ్యం కనుక రక్షణలు ఎప్పుడూ తక్కువ సంఖ్యలో ఉన్న వారికే కల్పించబడతాయి. భారతదేశంలో హిందూ ముస్లిం ఐక్యత సామరస్యం భవిష్యత్తు భద్రతకు అత్యవసరమని అర క్షణమైనా మర్చిపోకూడదు.

> దేశ ఆస్తులను ముస్లింలకు అప్పగించడం జరుగుతోందన్న దురభిప్రాయాన్ని కలిగించి మతాల స్పర్ధగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తున్న అస్త్రమే ఈ చట్ట సవరణ. ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు ఎవరైనా భారతీయులేనన్న రాజ్యాంగ స్ఫూహను దెబ్బతీసేలా ముస్లిం సంస్థల ఆస్తులు వశపరచుకోవటం పెద్ద విజయం లాగా చూపించటం ఎన్నికల లబ్ధి కోసమే. వక్ఫ్ బోర్డులోని 22 మంది సభ్యులలో నలుగురు ముస్లిమేతరులు ఉండాలని నిర్ణయించటం నిస్సందేహంగా వారి మత భావాలను దెబ్బతీసే అంశం అవుతుంది. ఒకవైపున తిరుపతిలో అన్య మత ఉద్యోగులను కూడా తొలగించాలంటున్న తీరుకు ఇది పూర్తి విరుద్ధం. దేవాలయాలను పూర్తిగా మత సంస్థలకు అప్పగించాలంటూ ఇటీవల విజయవాడలోనే భారీ సమీకరణ జరపటం కూడా చూశాం.

వక్ఫ్‌పై కేంద్రం భాష

2019లో బిజెపి రెండోసారి అధికారంలోకి రాగానే ఆర్టికల్ 370 అధికరణం రద్దుకు పాల్పడటం వెనుక ఏ వ్యూహం ఉందో మూడోసారి నెగ్గాక వక్ఫ్ మీద దాడి కేంద్రీకరించటం వెనకా అదే వుంది. ఎన్డీఏలో భాగస్వామ్య పార్టీలు మాత్రమే కాక రెండు లౌకిక పక్షాలు కూడా దాన్ని బలపరచటం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా వైసిపి, అలాగే బిఆర్‌ఎస్ ఈ బిల్లుపై బిజెపి కి వ్యతిరేకంగా ఓటు చేయడం విశేషం. బిల్లు ఆమోదం పొందాక ఇది చారిత్రిక మూల మలుపు అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా అచ్చంగా అలాంటి ప్రకటన విడుదల చేయడం యాదృచ్ఛికం కాదు. తెలుగుదేశం పార్టీ తాము ఏవో సూచనలు చేశామంటూ కొన్ని సంకేతాలు ఇవ్వడానికి ప్రయత్నించినా వారు బేషరతుగా మద్దతు ఇవ్వడాన్ని దేశం గమనించింది. దక్షిణాది సీట్ల తగ్గింపు, ఈ బిల్లు రెండు విషయాల్లో వ్యవహరించిన దాన్నిబట్టి టిడిపి అధినేత చంద్రబాబు మోడీని ఏ మాత్రం వ్యతిరేకించరాదని నిర్ణయించుకున్నట్టు 'హిందూ' ప్రత్యేక వ్యాసమే ప్రచురించింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వుంది గనక బిజెపి కన్నా దాన్ని ఎదుర్కోవటం కీలకమని భావిస్తున్న టిఆర్‌ఎస్ కూడా దీన్ని ఈ బిల్లు విషయంలో మాత్రం వ్యతిరేకించి ఓటేయడం మంచి విషయమే. ఇటీవల తిరుపతిలో జరిగిన పరిణామాలు, ఇప్పుడు పాస్టర్ ప్రవీణ్ మరణంపై సాగుతున్న వివాదం, విద్వేషపూరిత వ్యాఖ్యలు అన్నీ గమనిస్తే చాప కింద నీరులా తెలుగు రాష్ట్రాల్లోనూ మత రాజకీయాలు చొరబడుతున్న తీరు కళ్ళకు కడుతుంది. ఇక్కడ బిజెపి పెద్ద శక్తి కాకపోయినా వామపక్షాలు ఎక్కువ కేంద్రీకరిస్తున్నాయంటూ మాట్లాడే వాళ్లకు ఈ పరిణామాలే హెచ్చరికలవుతాయి. వక్ఫ్ బిల్లు గజెట్ అయ్యాక సుప్రీంకోర్టులో సవాలు చేస్తామంటున్న నేపథ్యం ఒకవైపుంటే అటు నుంచి మతపరమైన స్పందనలు ఎలా ఉంటాయో కూడా చూడాల్సిందే.

నాగపూర్ నాటకాలు

మోడీ పర్యటన విషయానికి వస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ మూల స్తంభాలైన హెగ్డేవార్, గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ పదకొండేళ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు అసలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘ పరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆర్‌ఎస్‌ఎస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని, బిజెపి ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆర్‌ఎస్‌ఎస్ ముందు సమీక్షకు హాజరైంది.

> మోడీ పర్యటన విషయానికి వస్తే ఆయన నాగపూర్‌లో మాధవ నేత్రాలయను ప్రారంభించటంతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ మూల స్తంభాలైన హెగ్డేవార్, గోల్వాల్కర్‌ల స్మృతి చిహ్నాలను సందర్శించటం, వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్న కార్యక్రమాలే. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి మాత్రమే వాటిని సందర్శించిన ప్రధానమంత్రి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా బయలుదేరిన నేత అయినప్పటికీ నరేంద్ర మోడీ కూడా ఈ పదకొండేళ్లలో అక్కడికి వెళ్లిన దాఖలాలు అసలు లేవు. ఆయన వ్యక్తిగత నాయకత్వ శైలి సంఘ పరివార్ పెద్దలకు నచ్చలేదని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి కానీ అదంతా పరివార్ పాచిక మాత్రమే. ఆర్‌ఎస్‌ఎస్ సాంస్కృతిక సంస్థ మాత్రమేనని, బిజెపి ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆర్‌ఎస్‌ఎస్ ముందు సమీక్షకు హాజరైంది.

గత ఏడాది అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ సంప్రోక్షణ కార్యక్రమానికి మోడీ తోపాటు ప్రస్తుత ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్ కూడా హాజరయ్యారని గుర్తుంచుకోవాలి. 2024 ఎన్నికలకు ముందు దేశానికి హిందూత్వ సంకేతం ఇవ్వడం కోసమే వారి వారి కాంబినేషన్ అక్కడ అవసరమైంది. అయితే ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా మాట్లాడుతూ గతంలో బిజెపికి తగినంత బలం లేదు కనుక ఆర్‌ఎస్‌ఎస్ సహకారం తీసుకునేవారమనీ, ఇప్పుడు సొంత శక్తితో ఎదిగాం కనుక ఆ అవసరం లేదని వ్యాఖ్యానించారు. తాను ఏదో దైవ కార్యం నిర్వహించడానికి పంపబడినట్టు అనిపిస్తుందని, సాధారణ జీవపదార్థంతో వున్నట్టు అనుకోనని మోడీ చెప్పారు. ఈ రెండు ప్రకటనలు ఆర్‌ఎస్‌ఎస్ వారికి నచ్చలేదనీ కథనాలు నడిచాయి. మొన్నటి ఎన్నికలలో బిజెపి మెజారిటీ కోల్పోయి 243 స్థానాలకు పరిమితమైనాక మోహన్ భగవత్ ఇంటర్వ్యూ ఇస్తూ ఎవరికైనా అహంభావం తగదని వ్యాఖ్యానించారు. తాము సేవకులమనే భావన నుంచి దైవ స్వరూపులమని అహంకరించడం ప్రారంభించినప్పుడు దెబ్బతింటారని అన్నారు. మామూలుగానే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తమ కేంద్ర కార్యాలయం నుంచి సూక్తులు సుశబ్దాలు వినిపిస్తుంటారు. ఇవి ఎవరిని ఉద్దేశించినవి అన్నది స్పష్టం చేయరు. భగవత్ మాటలు మోడీపై అభిశంసన లాంటివేనని బడా మీడియా కథనాలు మొదలు పెట్టింది. నిజంగా చెప్పాలంటే సనాతన సంప్రదాయంలోనూ రాజును దైవ ప్రతినిధిగా మొదట చెప్పి, తర్వాత నేరుగా దేవుడుగానే అభివర్ణించడం చూస్తాం. ఇదంతా ఒక రాజ్యాధిపత్యం వ్యూహం ప్రకారమే జరిగింది. అటు రాజ్యం ఇటు మతం కూడా రాజు చేతుల్లోనే ఉండటానికి అది మార్గం. కాకపోతే మతాధిపతులు సంధానకర్తలుగా రాజ్య వ్యవస్థకు అనుగుణంగానే తమ పాత్ర నిర్వహించేవారు. ఇప్పుడు మోడీ, భగవత్‌ల సంభాషణ అచ్చంగా అదే చెప్తుంది. సంబంధం ఉందని, లేదని రకరకాలుగా చెప్పడం నిరంతర తతంగమే. ప్రస్తుత పర్యటనలో కూడా మోడీ ఆర్‌ఎస్‌ఎస్ తమను ఎంతగా ఉత్తేజపరిచిందో సూటిగా చెప్పారు. ఇది సంస్థతో రాజీ వంటిదని ఇస్తున్న వివరణ అర్థం లేనిది. ఎందుకంటే అసలు అవి ఎప్పుడు దూరంగా ఉన్నాయి? ఒకప్పుడు వాజ్‌పేయినే ఈ మాట అన్నారు-మేము విడిపోయిందెప్పుడు అని. వారి మధ్య ఈ అలుక కినుక, దూరం రాయబారం ఇదంతా ఒక క్రీడలో భాగం. మొన్న మెజార్టీ రాలేదుగనక మోడీని మార్చాలని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నందునే ఆయన సర్దుబాటు కోసం వచ్చారని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అంటే నాలుగోసారి కూడా ఆయనే ప్రధాని అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించడం అందులో భాగమే. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడాన్ని అనుమతిస్తూ ప్రభుత్వం కొంతకాలం కిందటే ఉత్తర్వులు జారీ చేసింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి దానిపై నిషేధం చెల్లదని ప్రకటించడాన్ని అవకాశంగా తీసుకుని మోడీ సర్కార్ దాన్ని ఎత్తివేసింది. ఇప్పుడు అధికారికంగానే ఆర్‌ఎస్‌ఎస్ తో చెట్టపట్టాలు వేసుకొని తిరిగే అవకాశం తనకు తానే ఇచ్చుకుంది.

వాటినీ రగిలిస్తాం!!

ఇక హోసబ్లే ప్రకటనను బట్టి సంఘపరివార్ కాశీ, మధుర వివాదాలను ఎగదోయాలని నిర్ణయించుకున్నట్టు చాలా స్పష్టంగా అర్థమవుతుంది. స్థానిక భక్తులు లేదా విభిన్న పక్షాలకు పరిమితమైన ఈ తగాదాలు ఇప్పుడు అధికారికంగా పాలక పరివార్ స్వీకరిస్తుందన్నమాట. గతంలో మోహన్ భగవత్ ప్రతి మసీదును తవ్వడం మన పనికాదని సూక్తులు చెప్పినప్పుడే ఆంతర్యం ఇదేనని మనం చెప్పుకున్నాం. అయోధ్య, కాశీ, మధుర మూడు చోట్ల వివాదాలపై ఉద్యమించాలని తాము గతంలోనే అధికారికంగా నిర్ణయించామని హోసబ్లే గుర్తు చేస్తున్నారు. ఈ మూడూ మాకిస్తే మిగిలిన వివాదాలను పక్కన పెడతామని ఎల్.కె అద్వానీ ఒక దశలో ప్రతిపాదన పెట్టడం కూడా గుర్తు చేసుకోవాలి. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ప్రకారం అయోధ్య మినహా మరి ఎక్కడా ఇలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదు. 1947 ఆగస్టు 15న ఆ యా ప్రార్థనా స్థలాలలో ఉన్న యథాతథ స్థితిని కొనసాగించవలసి ఉంటుందని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. అయినా సుప్రీంకోర్టు ఇలాంటి పిటిషన్లను విచారణకు స్వీకరించి వివాదాలకు అవకాశం ఇస్తుంది. ప్రతి చోటా తగాదాలు రగిలించబడతాయి. ఇదేదో జాతీయ సమస్య తప్ప దక్షిణాన అందులో తెలుగు రాష్ట్రాల్లో అసలు ఆ పరిస్థితి లేదని చెప్పడానికి ఇప్పుడు ఎవరూ సాహసించబోరు. ఎందుకంటే ఆలయాల వివాదాలు, మత మార్పిడులు వీటిని కీలకంగా మాట్లాడే సనాతనవాద నేతగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందుకు వచ్చారు. తమిళనాడులో అన్నాడిఎంకె మళ్ళీ బిజెపితో చర్చలు ప్రారంభించడం. పవన్ కల్యాణ్ తమిళంలో ఇంటర్వ్యూ ఇస్తూ అక్కడ కూడా రాజకీయంగా కాలూనడం విస్మరించలేము. మీకన్నా మేమే సనాతన ధర్మానికి ఎక్కువగా కట్టుబడి ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూడా ఒక ప్రకటన చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సందేహాలు, సంవాదాలను కేవలం వైసిపి, టిడిపి తగాదాగా చూపించే ప్రయత్నాలు కూడా తీవ్రంగా జరుగుతున్నాయి. ఇక తెలంగాణలో రాజా సింగ్ వంటి వారు బిజెపికి దూరంగా ఉన్నట్టు మాట్లాడుతూనే ప్రతి సందర్భంలో మతాలు మధ్య చిచ్చు రాజేస్తున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ వివాదాలకు పేరుమోశారు. వక్ఫ్ నుంచి టిటిడి వ్యవహారాల వరకూ ప్రతిదీ వివాదాస్పదమై మత రాజకీయాలను మన ముంగిట్లోకి తెచ్చి నిలబెడుతున్నదని గుర్తించటం, అప్రమత్తం కావడం తప్పనిసరి. ●

ప్రజా సమస్యలను వెలికి తీసిన చైతన్య యాత్ర

సమస్య



ఎం. రాజశేఖర్

విశాలమైన సముద్రతీర ప్రాంతం, అపారమైన ప్రకృతి వనరులు, పరిశ్రమలకు, వాణిజ్యానికి అన్నింటా అనువుగా ఉండే ప్రాంతం కాకినాడ జిల్లా. కాని ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో ప్రభుత్వాల పాలన సాగుతోంది. మార్చి 7 నుంచి రెండు రోజుల పాటు సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు ఏకరువు పెట్టిన సమస్యలే దీనికి నిదర్శనం.

రాష్ట్రంలో మొట్టమొదటిగా సిపిఎం ప్రజాచైతన్య యాత్ర కాకినాడ జిల్లా నుంచి ప్రారంభమైంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటుగా రాష్ట్ర కేంద్రం నుంచి ఎం.హరిబాబు, కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్ సహా 20 మంది, జిల్లా కమిటీ సభ్యులు, కార్మికులు సైకిల్ యాత్రలో భాగంగా ఊరూరా తిరిగి సమస్యలను పరిశీలించారు.

సుందరయ్య భవన్ నుంచి మొదలైన యాత్ర జగన్నాథపురం వంతెన మీదుగా తూరంగి డ్రైవర్స్ కాలనీకి చేరుకుంది. కాలనీవాసులు మంచినీటి సమస్యపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమకు సరఫరా అయ్యే మంచినీటి ట్యాంక్ క్లీనింగ్, నీటి సరఫరా అధ్వాన్నంగా ఉందని తెలిపారు. నెలకు రూ.1000 నుంచి రూ.1,200 మంచి నీటికే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలిచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. పగడాల పేట వద్ద మత్స్యకారులు యాత్ర బృందానికి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. సముద్రంలో చమురు కార్యకలాపాల నేపథ్యంలో వేట తగ్గిపోయిందని, కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం రావట్లేదన్నారు. ఇతర మండలాల్లో మత్స్యకార కుటుంబాలకు ఇస్తున్న రీతిలో ఏడాదికి రూ.70 వేల నష్టపరిహారం ఇవ్వాలని, సర్వే చేసి మత్స్యకార కుటుంబాలను గుర్తించాలని కోరారు. కరప మండలం పగడాల పేట గ్రామానికి చెందిన మత్స్యకారులు, గ్రామ పెద్దలు, సొసైటీ నాయకులు యాత్ర బృందానికి వినతిపత్రం అందించారు. మార్కెట్లో వ్యాపారం చేసుకునే వారికి ఐస్ బాక్సుల కొనుగోలుకు రుణాలు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం యాత్ర గురజనాపల్లి సెంటర్ మీదుగా తాళ్ళరేవు మండలం చొల్లంగి గ్రామానికి చేరుకుంది. ఇళ్ల స్థలాల సమస్యపై గ్రామస్తులు వినతిపత్రం అందించారు. తమకు ఉపాధి దొరకడం లేదని ఉపాధి పనులు పెంచాలని మహిళా కూలీలు కోరారు. అనంతరం చొల్లంగి పేటలోని నర్సరీలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు తమకు పనులు సరిపోవడం లేదని, వ్యవసాయ పనులు కూడా లేవని తెలిపారు. కూలి పెంచాలని కోరారు. యుపిఎ ప్రభుత్వంలో సిపిఎం భాగస్వామిగా ఉన్న కాలంలో ఉపాధి హామీ చట్టం తేవడానికి చేసిన కృషిని ఈ సందర్భంగా వివిఎస్ఆర్ వివరించారు. ఈ చట్టంపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టి, చట్టాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చొల్లంగి పేటలోని కొబ్బరిచెట్టు పేట కాలనీని సందర్శించారు. అక్కడ కాలనీవాసులు డ్రెయిన్లు లేక ఇళ్ల దగ్గర నిలిచిపోయిన మురుగు నీటిని చూపించారు. మురుగుతో వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర అమలు ఇక్కడ కనిపించట్లేన్నారు. తమకు మూడు నెలలుగా కరెంటు బిల్లులు అధికంగా వస్తున్నాయని, వాడుకున్న కరెంటు యూనిట్ల కంటే 5 రకాలు చార్జీలు పేరుతో వేసిన బిల్లే ఎక్కువగా ఉందని జి.వేమవరం మహిళలు వాపోయారు. వంద యూనిట్లు వాడుకుంటే రూ.3,500 బిల్లు వచ్చిందని తెలిపారు. కొత్తూరు ఎస్‌సి కాలనీలో పెద్దలతో, కొత్తూరు మహాలక్ష్మి గుడి ఆవరణలో మత్స్యకార పెద్దలతో బృందం సమావేశమైంది. 2024 వేట నిషేధ పరిహారం నేటికీ రాలేదని మత్స్యకారులు తెలిపారు. బోట్లకు రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో వేటకు వెళ్లే చాలా మంది పేర్లు నమోదు కాలేదని తెలిపారు. సొసైటీలకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందించాలని వారు వినతిపత్రం అందించారు.

కాకినాడలో సుందరయ్య భవన్ నుంచి బయలుదేరిన ప్రజా చైతన్య యాత్ర (ఫైల్ ఫొటో)

> సాగునీటి కోసం తాళ్లరేవు ఇరిగేషన్ ఆఫీస్ దగ్గర రైతులు చేస్తున్న ఆందోళనకు ప్రజా చైతన్య యాత్ర బృందం మద్దతు తెలిపింది. సిపిఎం, కౌలు, రైతు సంఘం నాయకులు సాగునీటి కోసం వారం రోజులుగా చేస్తున్న ఆందోళనలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఆయన అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. అనంతరం అధికారులు స్పందించారు. మోటార్లతో నీటిని తోడి చేలకు అందించే చర్యలు చేపట్టారు.

పటవల గ్రామంలో కౌలు రైతులు వినతి పత్రం ఇచ్చారు. కౌలు రైతులకు పంట పెట్టుబడి సాయం ఇవ్వడం లేదని, కులం పేరున ఒసిలకు భరోసా ఇవ్వడం లేదని తెలిపారు. పాత కోరంగి వెళ్లడానికి నిర్మించిన రోప్ వే స్థానంలో పర్మినెంట్ బ్రిడ్జి నిర్మించాలని, ఆక్వా పరిశ్రమల కాలుష్య కారకాలు కోరంగి నదిలో కలిసి పాత కోరంగి పంట కాలువలోకి వచ్చి తమ పంట పొలాల్లో దిగుబడి తగ్గిపోతుందని, దీన్ని నివారించాలని గ్రామస్తులు కోరారు. ప్రతాప్ నగర్ కాలనీలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉపాధి లేక గ్రామంలో నిరుద్యోగులు పెరిగిపోతున్నారన్నారు.

తాళ్లరేవు పంచాయతీ మాధవ రాముడు పేట శ్రీరామ నగర్‌లో మురుగునీటి పరిస్థితిని ప్రజలు బృందానికి చూపించారు. రెడ్డివారి పేట ప్రజలు బృందంతో మాట్లాడుతూ జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిలు వేశారని, కాని వీటి నుంచి నేటికీ నీరు రాలేదని వాపోయారు. నీరు లేక ఎండిపోతున్న చేలను రైతులు బృందానికి చూపించారు. దశాబ్దాలుగా అన్ని కులాల వారు ఇక్కడ సాగు చేసుకుంటున్నారని, నేటికీ భూమిపై హక్కు పత్రాలు ఇవ్వలేదని రైతులు వాపోయారు.

సాగునీటి కోసం తాళ్లరేవు ఇరిగేషన్ ఆఫీస్ దగ్గర రైతులు చేస్తున్న ఆందోళనకు ప్రజా చైతన్య యాత్ర బృందం మద్దతు తెలిపింది. సిపిఎం, కౌలు, రైతు సంఘం నాయకులు సాగునీటి కోసం వారం రోజులుగా చేస్తున్న ఆందోళనలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఆయన అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. అనంతరం అధికారులు స్పందించారు. మోటార్లతో నీటిని తోడి చేలకు అందించే చర్యలు చేపట్టారు.

నీలపల్లి పంచాయతీ సిద్ధార్థ నగర్ శ్మశాన సమస్యను పరిశీలించారు. మండలంలో సాగునీటి సమస్యకి కారణంగా వున్న ఇంజరంలోని ఆర్ అండ్ బి వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. కాలువపై అడ్డంగా నిర్మించిన చప్టా కారణంగా నీరు రావట్లేదని రైతులు బృందానికి తెలిపారు. తక్షణమే వంతెన నిర్మించాలని కోరారు. అనంతరం జార్జి పేట పంచాయతీ తూర్పు పేటలో కోరంగి కంపెనీ భూములు సమస్యపై ప్రజలు బృందానికి వివరించారు. తాళ్ళరేవు పంచాయతీ రచ్చవారిపేట మత్స్యకార గ్రామంలో సమస్యలను వివరించారు. కోరంగి కాలువలోకి ఆక్వా కంపెనీలు వ్యర్థాలను వదిలేస్తున్నాయని, దాంతో నీరు కలుషితమై కాలువలో చేపల వేటకు వీలు లేకుండా పోయిందన్నారు. కరప మండలం, కాజులూరు మండలాల్లోనూ ప్రజా చైతన్య యాత్రలు జరిగాయి. కరపలోని నక్క వారి పేటలో విషజ్వరాలు ప్రబలిన ప్రాంతంలో బృందం పర్యటించిది. ఇక్కడ వందకు పైగా దళితుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. కాజులూరు మండలం ఒంటితాడి గ్రామంలో మత్స్యకారుల కాలనీలో తీవ్ర తాగునీటి సమస్యను బృందం గుర్తించింది. స్థానిక సమస్యలపై సిపిఎం కృషి ప్రారంభమైంది. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. ప్రజలు కూడా ఇందులో భాగస్వాములైతే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

/ వ్యాసకర్త సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యులు, సెల్ : 9912172997 /

నాలుగు రాష్ట్రాలకు రూ.1280 కోట్ల విపత్తు సాయం

- కేరళకు మొండి చేయి

న్యూఢిల్లీ : కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత కొనసాగిస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ పలు రాష్ట్రాలకు విపత్తు సాయం అందించేందుకు శనివారం ఆమోదం తెలిపింది. బీహార్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడుతో పాటు పుదుచ్చేరికి రూ.1280.35 కోట్ల అదనపు సహాయాన్ని అందించేందుకు ఈ కమిటీ ఆమోదం తెలిపింది. గతేడాది భారీ వర్షాలు, వరదలు, తుఫానులు, కొండచరియలు విరిగిపడ్డం వంటి విపత్తులను ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపింది. మొత్తం రూ.1280.35 కోట్లలో బీహార్‌కు రూ.588.73 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కు రూ.136.22 కోట్లు, తమిళనాడుకు రూ.522.34 కోట్లు, పుదుచ్చేరికి రూ.33.06 కోట్లు అందించనున్నట్లు పేర్కొంది.

జస్టిస్ వర్మ నోట్ల కట్టల కేసు..
ఢిల్లీ పోలీస్ కమిషనర్ వాంగ్మూలం నమోదు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయవాది జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంలో దర్యాప్తు కమిటీ పలువురిని విచారిస్తోంది. ఇందులో భాగంగా ముగ్గురు జడ్జిల కమిటీ ముందు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా హాజరయ్యారు. ఆయనను కమిటీ రెండు గంటల పాటు విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. అలాగే, న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) దేవేశ్ కుమార్ మహలను దాదాపు నాలుగు గంటల పాటు విచారించి ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేసింది. చాణక్యపురిలోని హర్యానా స్టేట్ గెస్ట్ హౌజ్‌లో వీరిని విచారించినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు పోలీసులు, సిబ్బందిని దర్యాప్తు కమిటీ విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ముగ్గురు జడ్జిలతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే.

'ఎంపురన్' దర్శకుడిపైనా 'ఐ'టి

- పృథ్వీరాజ్ సుకుమారన్‌కు నోటీసులు

చెన్నయ్ : గుజరాత్‌లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సంఘ్ పరివార్ గూండాలు సాగించిన నరమేధాన్ని కళ్లకట్టేలా తెరకెక్కించిన మలయాళ 'ఎంపురన్' (లూసిఫర్ 2) చిత్ర బృందంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు కొనసాగిస్తున్నాయి. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు ఆదాయపు పన్ను (ఐటి) విభాగం నోటీసులు జారీ చేసింది. చిత్రాల ద్వారా సంపాదించిన ఆదాయం, ప్రస్తుత ఆస్తుల వివరాలను ఏప్రిల్ నెలాఖరులోగా తెలియజేయాలని ఐటి విభాగం తన నోటీసుల్లో కోరింది. కాగా, శుక్రవారం ఎంపురన్ నిర్మాతల్లో ఒకరైన గోకులం గోపాలన్ నివాసం, కార్యాలయంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

జెడియుకు మరో నలుగురు నాయకులు గుడ్‌బై

పాట్నా : వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు మద్దతిచ్చిన జెడియుపై ఆ పార్టీ నాయుకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం నేతలు ఒక్కరొక్కరిగా పార్టీని వీడుతున్నారు. తాజాగా మరో నలుగురు కీలక నాయకులు రాజీనామా చేశారు. పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ షానవాజ్ మల్లిక్, బెట్టియా (వెస్ట్ చంపారన్) జిల్లా ఉపాధ్యక్షులు నదీమ్ అక్తర్, పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ తబ్రేజ్ సిద్ధిఖీ అలిగ్, భోజ్‌పూర్ పార్టీ సభ్యులు మహ్మద్ దిల్షాన్ రయీన్ పార్టీకి రాజీనామా చేశారు. బిల్లుకు జెడియు మద్దతు ఇస్తుందని ఊహించలేదని వారు పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా పార్టీకి మద్దతిస్తున్న ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా జెడియు ఎంపీలు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడంతో వచ్చే ఎన్నికల్లో తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు హెచ్చరించారు.

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరిన ముస్లిం లా బోర్డ్

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరింది. ఎఐఎంపిఎల్‌బి బోర్డ్ జనరల్ సెక్రటరీ మౌలానా ఫజ్లూర్ రహీమ్ ముజద్దాది రాష్ట్రపతికి రాసిన లేఖలోని వివరాలను బోర్డ్ ప్రతినిధి ఎస్.క్యూ.ఆర్.ఇలియాస్ శుక్రవారం రాత్రి మీడియాకు విడుదల చేశారు. ఈ బిల్లు పూర్తిగా 'రాజ్యాంగ విరుద్ధం' మరియు 'దేశంలోని ముస్లింలపై దాడి'గా పేర్కొన్నారు.

ముస్లింల తర్వాత వంతు క్రైస్తవులదే !

- సంఘ్ పరివార్ పత్రిక 'ఆర్గనైజర్'లో ప్రత్యేక కథనం
- పినరయి విజయన్, రాహుల్ గాంధీ విమర్శల నేపథ్యంలో తొలగింపు

న్యూఢిల్లీ : మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని వివిధ రూపాల్లో దాడులు సాగిస్తున్న సంఘ్ పరివార్..తమ లక్ష్యాలను కూడా ఇదివరకే అక్షరబద్ధం చేసింది. వక్ఫ్ బోర్డుల తర్వాత క్రైస్తవ చర్చిల పని పట్టాల్సిన అవసరముందని పేర్కొంటూ ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. వక్ఫ్ సవరణల బిల్లును ఆమోదించిన నేపథ్యంలో సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే ఈ బిల్లుకు క్రైస్తవుల నుంచి మద్దతు ఉందంటూ బిజెపి, సంఘ్ పరివార్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'ఆర్గనైజర్' కథనాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. ముస్లిం తర్వాత మోడీ సర్కార్ లక్ష్యం క్రైస్తవేలనంటూ ఆయన విమర్శలు గుప్పించారు. ఈ మేరకు విజయన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆర్గనైజర్' కథనం ఆర్‌ఎస్‌ఎస్ దుర్బుద్ధిని ప్రతిబింబిస్తోందని, అనవసరంగా, అసందర్భంగా ఆ పత్రిక క్రైస్తవ ఆస్తుల గురించి కథనంలో ప్రచురించిందని తప్పుబట్టారు. ఇది తప్పుడు సంకేతాలను ఇవ్వడమే గాక, ఆర్‌ఎస్‌ఎస్ దుర్బుద్ధిని కూడా ప్రతిబింబిస్తోందని విజయన్ పేర్కొన్నారు. 'ఆర్గనైజర్ కథనం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ తదుపరి లక్ష్యం క్యాథలిక్ చర్చిలేనన్న సంగతి అర్థమవుతుంది. ముస్లిం మైనార్టీలకు ఉన్న రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ వక్ఫ్ సవరణల బిల్లును పార్లమెంటులో ఆమోదించుకున్న నేపథ్యంలో ఆర్గనైజర్ కథనం రావడం చూస్తే సంఘ్ పరివార్ తదుపరి లక్ష్యం క్రైస్తవులేనన్నది స్పష్టమవుతోంది' అని విజయన్ తెలిపారు. మైనార్టీలను క్రమ, క్రమంగా ఒకరి తర్వాత ఒకరని నాశనం చేయాలనే బృహత్తర కుట్రలో భాగంగానే వక్ఫ్ సవరణల బిల్లును తీసుకొచ్చారని విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర చర్యలకు వ్యతిరేకంగా ప్రగతిశీల, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమాలను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇదే రీతిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేథలిక్ చర్చిలు, వక్ఫ్ బోర్డుల అధీనంలో వున్న స్థలాలను పోలుస్తూ వచ్చిన సదరు వ్యాసాన్ని'ఆర్గనైజర్' తొలగించింది.

ఇంతకీ ఆ కథనంలో ఏముంది?

'భారత్‌లో ఎవరికి ఎక్కువ భూమి వుంది? కేథలిక్ చర్చిలు వర్సెస్ వక్ఫ్ బోర్డుపై చర్చ' అనే శీర్షికతో ఆర్గనైజర్‌లో వ్యాసం వచ్చింది. భారతదేశంలో కేథలిక్ చర్చిల అధీనంలో 7కోట్ల హెక్టార్లకు పైగా భూమి వుందని, అది, ప్రభుత్వేతర భూ యజమానుల్లో ఇదే అతి పెద్దదని ఆ వ్యాసం పేర్కొంది. ఈ భూమి విలుల రూ.20వేల కోట్లు వుంటుందని అంచనా వేసినట్లు తెలిపింది. భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో వక్ఫ్ బోర్డు కన్నా ఎక్కువగా చర్చి కీలక పాత్ర పోషిస్తోందని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వం తర్వాత దేశంలో రెండో అతిపెద్ద భూ యజమాని అంటే వక్ఫ్ బోర్డేనని అందరిలోనూ సాధారణంగా ఒక నమ్మకం వుందని, కానీ వాస్తవిక డేటాతో ఈ నమ్మకం సరిపోలడం లేదని పేర్కొంది. కేథలిక్ చర్చి అతిపెద్ద ప్రభుత్వయేతర భూ యజమానిగా ఆవిర్భవించిందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూముల సమాచార వెబ్‌సైట్ నుండి సేకరించిన డేటాను ఈ వ్యాసంలో పొందుపరిచారు.

ఈ వ్యాసం లక్ష్యమేంటి ?

ఈ వ్యాసం లక్ష్యం ఏమిటని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే బిజెపి వైఖరికి ఇదొక చక్కని ఉదాహరణ అని విమర్శించారు. దీనిపై తాను ఇప్పటికే ప్రజలను హెచ్చరించానన్నారు. క్రిస్టియన్లపై తన దృష్టిని మళ్లించేందుకు బిజెపికి ఇక ఎక్కువ సమయం పట్టదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ నేతలు రమేష్ చెన్నితాల కూడా ఆర్‌ఎస్‌ఎస్ మేగజైన్ ప్రచురించిన వ్యాసాన్ని తీవ్రంగా విమర్శించారు. కాగా ఈ వివాదంపై స్పందిస్తూ మేగజైన్ సంపాదకులు ప్రఫుల్ కేట్కర్, ఆ వ్యాసం చాలా పాతదని చెప్పారు. వక్ఫ్ బిల్లు తర్వాత దాన్ని బయటకు లాగారని తెలిపారు.

జనజీవన స్రవంతిలోకి రండి

- మావోయిస్టులకు అమిత్ షా పిలుపు!

రాయ్‌పూర్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం మావోయిస్టులను 'సోదరులు'గా సంబోధించారు. ఆయుధాలను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని వారికి సూచించారు. ఓ నక్సలైట్ చనిపోతే సంతోషించే వారు ఎవరూ ఉండరని చెప్పారు. నక్సల్స్ ప్రభావిత బస్తర్ జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపేందుకు 2026 మార్చి తుది గడువు అని పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన వేడుకకు అమిత్ షా హాజరయ్యారు. 'బస్తర్‌లో కాల్పులు, పేలుళ్ల శకం ముగిసింది. ఈ రోజు కూడా నేను సాయుధ, నిరాయుధ నక్సల్స్ సోదరులకు ఓ విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయుధాలు విడిచి పెట్టండి. జనజీవన స్రవంతిలో కలవండి. మీరు మాలో ఒకరు. ఎక్కడైనా ఒక నక్సల్ హతమైతే సంతోషించే వారెవరూ ఉండరు. అయితే ఈ ప్రాంతం అభివృద్ధిని కోరుకుంటోంది. యాభై సంవత్సరాలుగా లేని అభివృద్ధిని ఐదు సంవత్సరాలలో ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. కానీ బస్తర్‌లో శాంతి నెలకొన్నప్పుడే అది సాధ్యపడుతుంది. బస్తర్‌ను నక్సల్స్ విముక్త ప్రాంతంగా చేసినప్పుడే అభివృద్ధి జరుగుతుంది' అని ఆయన చెప్పారు. నక్సల్స్ లేని ప్రతి గ్రామానికీ అభివృద్ధి కోసం కోటి రూపాయలు అందజేస్తామని షా తెలిపారు. 'మీ గ్రామంలోని మావోయిస్టులను లొంగిపోవాలని చెప్పండి' అని గ్రామస్తులకు సూచించారు.

దేశంలోనే అత్యధికంగా కాసరగోడ్‌లో అల్యూమినియం నిక్షేపాలు

తిరువనంతపురం : కేరళలోని కాసరగోడ్ జిల్లాలో దేశంలోనే అత్యధిక అల్యూమినియం ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్ర మైనింగ్, భూగర్భ శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న వివరణాత్మక భౌగోళిక సర్వే ద్వారా జిల్లాలోని కరడుక్క ప్రాంతం వద్ద దాదాపు 150 హెక్టార్లలో అత్యంత విలువైన అల్యూమినియం ఖనిజం నిల్వలను భారీ స్థాయిలో గుర్తించారు. అలాగే ఇక్కడ బాక్సైట్ కంటెంట్ 40 నుంచి 45 శాతం మధ్య ఉన్నట్లు సర్వేలో వెల్లడయింది. దేశంలోని ఇతర రాష్ట్రాల మైనింగ్ జోన్లలో ఈ కంటెంట్ 35 శాతం వరకూ మాత్రమే ఉంటుంది.

సర్వే ప్రకారం కరడుక్క ఉపరితలం కింద 150 హెక్టార్లల్లో 0.21 మిలియన్ టన్నుల హై గ్రేడ్ బాక్సైట్, 5.14 మిలియన్ టన్నుల అల్యూమినియం లాటరైట్ ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది భారతదేశంలోనే అత్యధికమని చెబుతున్నారు. సర్వే మరో రెండు, మూడు రోజుల్లో పూర్తవుతుందని, వివరణాత్మక సర్వే నివేదికను తర్వలో ఖరారు చేసి కొన్ని వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందచేస్తామని రాష్ట్ర మైనింగ్, భూగర్భ శాస్త్ర విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎంపి కిషోర్ మీడియాకు తెలిపారు. 150 హెక్టార్లలో భారీ నిక్షేపాలు ఉన్నాయని గుర్తించామని, వీటిలో 100 హెక్టార్లు దశలవారీగా మైనింగ్‌కు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. దశలవారీ మైనింగ్, మైనింగ్ హక్కుల వేలం ద్వారా రాష్ట్రానికి రూ 5 వేల కోట్ల వరకూ ఆదాయం వస్తుందని తెలిపారు. అలాగే, మైనింగ్ పూర్తయిన తరువాత పునరుద్ధరించిన భూమిని వ్యవసాయం, పారిశ్రామిక అవసరాలు, నివాసాల కోసం వినియోగించు కోవచ్చునని తెలిపారు.

మాంద్యానికి ట్రంప్ ఆజ్యం

- సంక్షోభానికి 60 శాతం అవకాశం
- యుఎస్‌లో ఉద్యోగాలుండవ్
- జెపి మోర్గాన్ అంచనా

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించనున్నారని అంతర్జాతీయ సంస్థలు గగ్గోలు పెడుతోన్నాయి. వాణిజ్య యుద్ధానికి తెర లేపి ఇప్పటికే స్టాక్ మార్కెట్లను కుప్పకులేలా చేసిన ట్రంప్ విధానాలు మరిన్ని ప్రమాదాలను సృష్టించనుందని హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది చివరి నాటికి ఆర్థిక మాంద్యం చుట్టుముట్టనుందని భావిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ చర్యలు ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టబోతున్నాయని దిగ్గజ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జెపి మోర్గాన్ విశ్లేషించింది. ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో మాంద్యం వచ్చే అవకాశం 60 శాతానికి చేరుకుందని అంచనా వేసింది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది చివరి నాటికి మాంద్యంలోకి ప్రవేశించే అవకాశం ఉందని విశ్లేషించింది. సంక్షోభం రావడానికి గతంలో 40 శాతం అవకాశాలుండగా.. ఇది ఇప్పుడు 60 శాతానికి చేరిందని పేర్కొంది.

యుఎస్ వాణిజ్య యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అతిపెద్ద ప్రమాదంగా మారిందని తెలిపింది. ఈ పరిణామాలు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)పై తీవ్ర పరిణామాన్ని చూపే అవకాశం ఉందని జిపి మోర్గాన్ సిఇఒ, ఆర్థిక నిపుణులు మైఖేల్ ఫెరోలి తెలిపారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ 2025 చివరి నాటికి మాంద్యంలోకి జారుకోనుందన్నారు. ఫలితంగా ఉద్యోగ నష్టాలు తప్పవని తన నివేదికలో వెల్లడించారు. 2025 ద్వితీయార్థంలో జిడిపి తగ్గుముఖం పడుతుందని తెలిపారు. మూడవ త్రైమాసికంలో 1 శాతం, నాలుగవ త్రైమాసికంలో 0.5 శాతం తగ్గుదల ఉంటుందని జెపి మోర్గాన్ అంచనా వేసింది. ఇది నిరుద్యోగానికి దారి తీయనుందని స్పష్టం చేసింది.

జెపి మోర్గాన్ రిపోర్ట్ ప్రకారం.. అమెరికాకు ధీటుగా ఇతర దేశాలు వేసే టారిఫ్‌లతో యుఎస్‌లో వస్తు ధరలు 1-1.5 శాతం వరకు పెరుగుతాయి. దీంతో ద్రవ్యోల్బణం పెరగనుంది. ఇదే విధానాలు కొనసాగితే అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ సృష్టి నిలిచిపోవడంతో పాటు, ఉన్న ఉద్యోగాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించొచ్చు. మాంద్యం వల్ల అమెరికాలో ఉద్యోగాలు ఊడిపోనున్నాయి. ఆర్థిక సంక్షోభం వల్ల నిరుద్యోగ రేటు 5.3 శాతానికి పెరిగే అవకాశముంది. కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయి. ఇందుకు ట్రంప్ విధిస్తున్న అధిక సుంకాలే ప్రధాన కారణం.

మరిన్ని సంస్థల హెచ్చరిక..

జెపి మోర్గాన్‌తో పాటు బార్క్లేస్, బోఫా గ్లోబల్ రీసెర్చ్, డ్యూష్ బ్యాంక్, యుబిఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ వంటి ప్రముఖ ఆర్థిక పరిశోధనా సంస్థలు ట్రంప్ చర్యలను తప్పుబట్టాయి. అధిక టారిఫ్‌లు అమెరికా ఆర్థిక వ్యవస్థను పతన దిశగా నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. ఈక్విటీ మార్కెట్లు ఇప్పటికే ఒత్తిడిలోకి జారుకున్నాయని హెచ్‌ఎస్‌బిసి పేర్కొంది. యుఎస్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించాయి. ఎస్‌అండ్‌పి గ్లోబల్ కూడా అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారిపోయే అవకాశాన్ని 35 శాతానికి పెంచింది. గోల్డ్‌మన్ సాచ్స్ వంటి కంపెనీలు అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లడం ఖాయమని ఇటీవలే పలు రిపోర్టుల్లో తెలిపాయి.

40 ఏళ్ల కనిష్టానికి దిగుమతులు..

ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు చేసుకునే దిగుమతులు 20 శాతం కన్నా ఎక్కువగా పడిపోవచ్చని యుఎస్ ఆర్థికవేత్త జోనాథన్ పింగిల్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లో దిగుమతుల స్థాయి 1986కు ముందు స్థాయి కనిష్టానికి క్షీణించొచ్చన్నారు. అంటే దాదాపు 40 ఏళ్ల కనిష్ట స్థాయికి దిగుమతులు పడిపోనున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ యుఎస్ ఫెడరల్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సైతం ట్రంప్ విధిస్తున్న సుంకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. అధిక టారిఫ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ వాణిజ్య విధానంలో తీవ్ర సంక్షోభం చోటు చేసుకోవచ్చనే అంచనాల్లో ఇటీవల అమెరికా సహా ప్రపంచ మార్కెట్లన్నీ తీవ్ర పతనాన్ని చవి చూస్తోన్న విషయం తెలిసిందే.

ఉక్రెయిన్‌పై రష్యా బలగాల దాడి

- జెలెన్‌స్కీ స్వస్థలంలో 18 మంది మృతి

కీవ్ : ఉక్రెయిన్‌పై రష్యా బలగాలు తాజాగా జరిపిన దాడిలో 18 మంది మరణించారు. ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ స్వస్థలమైన క్రివై రిగ్‌లో శుక్రవారం జరిగిన క్షిపణి దాడిలో 18 మంది మరణించగా..మరో 61 మంది గాయపడ్డారని ఆ ప్రాంత గవర్నర్ శనివారం తెలిపారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. మృతదేహాలను వీధిలో వరసగా పడుకోబెట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఆకాశంలోకి పెద్ద ఎత్తున పొగ మేఘాలు కమ్ముకుంటున్నాయి. నగరంలోని ఒక రెస్టారెంట్‌లో కమాండర్లు, ఇన్‌స్ట్రక్టర్లు సమావేశమవుతున్నారని తమకు సమాచారం అందిందని, అది తెలుసుకునే కచ్చితమైన లక్ష్యంతో దాడి జరిపామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా గత రాత్రి 49 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక రక్షణ విభాగం ధ్వంసం చేసిందని పేర్కొంది.

అమెరికా టారిఫ్‌లు.. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు చేటు

- వాణిజ్య యుద్ధంలో ఎవరూ గెలుపొందరు !
- యుఎన్ చీఫ్ హెచ్చరిక

ఐక్యరాజ్య సమితి : అమెరికా విధిస్తున్న టారిఫ్‌లతో 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన'పై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడుతుందని, 'వాణిజ్య యుద్ధం'లో విజేతలంటూ ఎవరూ వుండరని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్యం జరిపే కొన్ని భాగస్వామ్య దేశాలపై అధిక టారిఫ్‌లను విధించడంతో పాటూ కనీసం 10 శాతం పరస్పర సుంకాలను విధిస్తూ ట్రంప్ తీసుకువచ్చిన ఉత్తర్వులపై అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ విధానంపై యుఎన్ చీఫ్ స్పందన గురించి ప్రశ్నించగా, ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ మాట్లాడుతూ, పై వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఏ మాత్రమూ సన్నద్ధంగా లేని దేశాల గురించే తమ ఆందోళన అంతా అని ఆయన చెప్పారు. ఈ వాణిజ్య యుద్ధం వల్ల ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని అన్నారు. అమెరికా విధించిన టారిఫ్‌ల వల్ల అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ చాలా ప్రమాదకరమైన దశలోకి నెట్టబడుతోందని అంక్టాడ్ (వాణిజ్యం, అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి సదస్సు) శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. దీనివల్ల అభివృద్ధికి ముప్పు పొంచి వుందని, పెట్టుబడులు, ప్రగతి ముఖ్యంగా అత్యంత బలహీనమైన ఆర్థిక వ్యవస్థలు దెబ్బ తింటాయని హెచ్చరించింది. అమెరికా టారిఫ్‌లకు దీటుగా ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ కూడా పెద్ద ఎత్తున కొత్త టారిఫ్‌లు విధిస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని పేర్కొంది.

పేదరిక నిర్మూలనకు కొత్త ఆలోచనలు

(మొదటి పేజీ తరువాయి)

చేయూత ఇవ్వాలని సూచించారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, వాటిని తగ్గించాలని అన్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా అధిగమించాలని సూచించారు. ఎస్‌సి వర్గీకరణ జరగాలని 30 ఏళ్ల క్రితం నిర్ణయించామని, అది ఇప్పటికి సాధ్యమైందని అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ పథకం కింద ఎస్‌సిలకు రెండు కిలోవాట్ల సోలార్ విద్యుత్ పథకాన్ని అమలు చేస్తామని వివరించారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయనుందని తెలిపారు. ఎస్‌సి, బిసి పిల్లలకు గురుకుల విద్య, నైపుణ్య శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ.15 కోట్లు, ఏటూరు-మొగులూరు కాజ్‌వే నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తామన్నారు. రైతు సంఘాల ద్వారా పంటలు పండించే బాధ్యత తీసుకుంటామన్నారు. సుబాబుల్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామన్నారు. రైల్వే జోన్ సాధించామని తెలిపారు. పి-4 ద్వారా మరింత అభివృద్ధి సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

కొలికపూడితో కరచాలనం చేయని సిఎం

తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్న తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుతో సిఎం చంద్రబాబు కరచాలనం చేయలేదు. కొలికపూడి నమస్కారం పెట్టి పలకరించినా పట్టించుకోలేదు. ఆయనను చూడగానే సిఎం ముఖంలో కొంత ఆగ్రహం కనిపించింది. ఆయనను చూసీచూడనట్లుగా ఉండి ముందుకు సాగారు. పక్కనే ఉన్న టిడిపి, ఇతర పార్టీల నేతలు కూడా ముందుకు రావడంతో కొలికపూడి వెనక్కి వెళ్లిపోయారు. మరోవైపు ప్రజావేదికలో కూడా కొలికపూడికి అవకాశం దక్కలేదు. చంద్రబాబు సెక్యూరిటీ ఆయనను దూరంగా పంపినట్లు తెలిసింది.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంలో మరో రెండు పిటిషన్లు

ఆమాద్మీ పార్టీ ఎమ్మెల్యే అమనుతుల్లా ఖాన్

న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మరో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఒకటి ఆమాద్మీ పార్టీ ఎమ్మెల్యే అమనుతుల్లా ఖాన్ దాఖలు చేయగా, మరొకటి అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఎపిసిఆర్) అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసింది. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనదని, రాజ్యాగంలోని 14, 15, 21, 25, 26, 29, 30, 300-ఎ, అధికరణలను ఉల్లంఘిస్తోందని ఆప్ ఎంఎల్ఎ అమనుతుల్లా ఖాన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ బిల్లును కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను బిల్లు ఉల్లంఘిస్తోందన్నారు. ముస్లింల మత స్వేచ్ఛకు భంగకరంగా మారిందన్నారు. తమ ఆస్తుల, చారిటీ సంస్థలను నిర్వహించుకునేందుకు మైనారిటీలకు గల హక్కులను ఈ బిల్లు దెబ్బతీస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ప్రజాస్వామ్య, లౌకిక చట్రం యొక్క పునాది అయిన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 25, 26, 300ఎలను నేరుగా ఉల్లంఘిస్తోందని ఎపిసిఆర్ తన పిటిషన్‌లో పేర్కొంది. యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిసియేన్సి అండ్ డెవలప్‌మెంట్ బిల్లు 2025గా పేరు మారనున్న వక్ఫ్ (సవరణ) బిల్లు 2025లో ప్రతిపాదించిన సవరణలు అనవసరమైనవే కాకుండా ముస్లిం సమాజం యొక్క మతపరమైన వ్యవహారాల్లో ఆందోళనకరమైన జోక్యం కూడా అని విమర్శించింది. కాంగ్రెస్ ఎంపి మహ్మద్ జావేద్, ఎఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసి శుక్రవారమే ఈ బిల్లుపై సుప్రీం కోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే.

పదునెక్కుతున్న పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగానికి నిరసనగా పశ్చిమ బెంగాల్‌లో యువత ఆందోళనలు చేసిందని, బిజెపి దాడులకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా త్రిపురలో భారీ ఆందోళనలు సాగాయని వివరించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళలు, పిల్లలపై జరిగిన అత్యాచారాలు, వేధింపులకు వ్యతిరేకంగా కూడా సిపిఎం పెద్దఎత్తున ఆందోళనలు చేసిందని తెలిపారు.

పెరిగిన పార్టీ సభ్యత్వం

గత మహాసభ (2021) నుంచి ప్రస్తుత మహాసభ మధ్య కాలంలో సిపిఎం సభ్యత్వం పెరిగినట్లు రాఘవులు తెలిపారు. 2021 నాటికి 9,85,757గా ఉన్న పార్టీ సభ్యత్వం 2024 నాటికి 10,19,009కి చేరిందని, మహిళల సభ్యత్వం 18.2 శాతం నుంచి 20.2 శాతానికి పెరిగిందని వివరించారు. పార్టీలో యువకుల చేరిక పెరుగుతోందని తెలిపారు, 2021లో 19.5 శాతంగా ఉన్న యువత సభ్యత్వం 2024 నాటికి 22.6 శాతానికి చేరిందని, వర్గ పొందిక కూడా సంతృప్తికరంగా ఉందని చెప్పారు మొత్తం సభ్యత్వంలో 48.25 శాతం కార్మికవర్గానికి చెందిన వారు కాగా, 17.79 శాతం వ్యవసాయ కార్మికులు, 9.93 శాతం పేద రైతులు ఉన్నారని తెలిపారు. మొత్తం సభ్యత్వంలో 75.97శాతం పునాది వర్గాలకు చెందినవారని తెలిపారు.

జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవండి : తరిగామి

కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన జమ్మూ కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు తరిగామి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆకాంక్షలను కేంద్రం తీవ్రంగా దెబ్బ తీసిందని, సొంత దేశంలోనే శరణార్థుల్లా బతకాల్సిన పరిస్థితిని తీసుకువచ్చిందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత పరిస్థితులు ఘోరంగా మారాయని, ప్రజల చేతుల్లో నుంచి భూమి కార్పొరేట్ల చేతుల్లోకి పోతోందని అన్నారు. ఎన్నుకున్న ప్రభుత్వానికి కనీస హక్కులు కూడా లేవని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా విష కోరల్లో అల్లాడపాలెం

(మొదటి పేజీ తరువాయి)

కనిమెల్ల తాగునీటి పథకం నుంచి పైప్‌లైన్ ద్వారా వస్తున్న నీరే గత్యంతరంగా మారింది. గ్రామంలో వీధి కుళాయిల వద్ద నీటి కోసం పడిగాపులు కాస్తున్నామని మహిళలు చెబుతున్నారు. తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజృంభిస్తున్న వ్యాధులు

నీటి, వాయు కాలుష్యం వల్ల అల్లాడపాలెం గ్రామస్తులు కీళ్ల నొప్పులు, ముడుకులు పట్టేయడం, చర్మ వ్యాధులు, శ్వాసకోస సంబంధిత వ్యాధులు, వినికిడి సమస్యలతో బాధపడుతున్నారు. రెడ్డి నాగమ్మ, బట్టాన చౌదరి కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. వయసుతో సంబంధం లేకుండా గ్రామంలో ప్రతి కుటుంబంలోనూ అనారోగ్యం బారినపడిన వారు ఉన్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు గెడ్డ నీటిని తాగడానికి, వంటకు ఉపయోగించేవారమని, ప్రస్తుతం అటువైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు చెబుతున్నారు. అనారోగ్య సమస్యతో ఎక్కడికి వెళ్లినా 'ఓహో అల్లాడపాలెం నుంచి వచ్చావా? మీ ఊరికి మందులు లేవయ్యా' అంటూ వైద్యులు అంటున్నారని పల్నాడు సూర్యారావు ఆవేదన వ్యక్తం చేశారు.

తగ్గుతున్న పంట దిగుబడులు

కాలుష్యం కారణంగా వరి, జొన్నలు, నువ్వులు తదితర పంటల దిగుబడి గతంతో పోలిస్తే సగానికి సగం తగ్గింది. దీంతో, బోర్లు, బావులను వదులుకున్నామని, కేవలం వర్షపు నీరు, పాలవలస కాలువ ద్వారా వస్తున్న నీటితోనే సాగు చేస్తున్నామని గ్రామ రైతులు చెబుతున్నారు. ఎంతో కష్టపడి పండించినా ఆయా ఉత్పత్తుల కొనుగోలుకు ముందుకు రావడం లేదని, దీన్ని ఆసరాగా చేసుకుని దళారులు తక్కువ ధరకు దోచుకుంటున్నారని వాపోతున్నారు. ఫార్మా కంపెనీలు వెదజల్లుతున్న దూళి, దుమ్ము వల్ల ఈ ప్రాంతంలో విస్తారంగా ఉన్న కొబ్బరి తోటలు మసిబారుతున్నాయని గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే కొబ్బరి బొండాల దిగుబడి సగానికి పడిపోయిందని వాపోతున్నారు. కాలుష్య సమస్యల వల్ల గ్రామంతో చుట్టరికాలు, బంధుత్వాలు తగ్గిపోయాయని గ్రామానికి చెందిన కొమ్మూరు కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశాడు. అల్లాడపాలెంతోపాటు దానికి ఇరుగుపొరుగున ఉన్న కొణతలపాలెం, చోడమ్మ అగ్రహారం గ్రామాల్లోనూ దాదాపు ఇటువంటి దుస్థితులే ఉన్నాయి.

మీ చేతులకు రక్తం అంటింది!

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. సులేమాన్ ..మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగానికి అధిపతిగా ఉన్నారు. ఆ సంస్థ తీసుకొచ్చిన ఎఐ బ్రాండ్ 'కోపైలట్'కు మరిన్ని మెరుగులద్ది కొత్తగా రూపొందించిన అసిస్టెంట్ 'కోపైలట్' ప్రొడక్ట్ అప్‌డేట్స్ గురించి ఆయన ప్రజెంటేషన్ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిల్‌గేట్స్, సంస్థ మాజీ సిఇఒ స్టీవ్ బామర్, ప్రస్తుత సిఇఒ సత్యనాదెళ్ల కూడా హాజరయ్యారు. 2014 తర్వాత వీరు ముగ్గురూ పాల్గొనడం ఇదే తొలిసారి. సరిగ్గా ఆ సమయంలోనే మైక్రోసాఫ్ట్ ఉద్యోగి ఇబ్తిహాల్ అబౌసాద్ లేచి నిలబడి మైక్రోసాఫ్ట్ తీరును నిలదీశారు. 'లాభాల కోసం ఎఐ టెక్నాలజీని ఆయుధాలుగా ఇజ్రాయిల్ సైన్యానికి విక్రయిస్తున్నారు. మా ప్రాంతంలో మారణహోమం సష్టించడానికి, జాతి నిర్మూలనకు ఏఐని ఉపయోగించడం ఆపండి. మీ చేతుల్లో రక్తం ఉంది. మొత్తం మైక్రోసాఫ్ట్ చేతుల్లో రక్తం ఉంది. గాజాలో అమాయకులను, పసిపిల్లలను చంపుతున్నప్పుడు మీరు వార్షికోత్సవం జరుపుకుంటున్నారు. మీకు సిగ్గు ఉందా?' అని ఆమె ఆక్రోశించారు. 'మారణహోమం కోసం ఏఐని ఉపయోగించడం ఆపండి' అంటూ నినదించారు. ఆమె నిరసన తెలుపుతూ వేదిక వద్దకు వస్తుండగా.. సులేమాన్ తన ప్రసంగాన్ని నిలిపేశారు. 'నేను మీ మాటలు వింటున్నా. థాంక్యూ' అంటూ ఆయన బదులిచ్చారు. భద్రతా సిబ్బంది ఆమెను అక్కడి నుండి బయటకు పంపివేస్తుండగా .. పాలస్తీనా వాసులకు మద్దతుగా ఉపయోగించే స్కార్ఫ్‌ను ఆమె వేదిక పైకి విసిరారు. ఆ తర్వాత కార్యక్రమం కొనసాగింది. కొద్దిసేపటి తర్వాత మరో ఉద్యోగి వానియా అగర్వాల్ లేచి నిరసన తెలియజేశారు. ఇజ్రాయిల్ ఆర్మీతో ఎఐ ఒప్పందాలు రద్దు చేసుకోసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామం అనంతరం ఇబ్తిహాల్, అగర్వాల్ మైక్రోసాఫ్ట్ లాగిన్స్‌ను ఆసంస్థ నిలిపివేసింది. దీంతో వారిద్దరిని తొలగించినట్లుగా పరోక్షంగా తెలిపింది.

ఇజ్రాయిల్ ఆర్మీకి ఎఐ టెక్నాలజీ విక్రయానికి సంబంధించి ఒప్పందాలపై చర్చించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో సంస్థ సిఇఒ సత్యనాదెళ్ల సమావేశం నిర్వహించగా ఐదుగురు ఉద్యోగులు ఆ సమావేశాన్ని బహిష్కరించిన నిరసన తెలిపారు. అది అంతర్గత సమావేశం కాగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమం బహిరంగ వేడుక కావడం విశేషం. పైగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుండటంతో మైక్రోసాఫ్ట్ బాగోతం ప్రపంచమంతా తిలకించింది.

గాజాలోనూ, లిబియాలోనూ అమానీయ దాడులు చేస్తూ మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ సైన్యం లక్షిత బాంబు దాడులు చేయడానికి కో పైలట్, ఓపెన్ ఎఐ వంటి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగిస్తోందని అసోసియేటెడ్ ప్రెస్ నిర్వహించిన పరిశోధనలో వెల్లడయ్యింది.

మీకోసం

పొట్టు మినపప్పు వాడేవారు పొట్టుతో కలిపి పప్పు రుబ్బుకుంటే ఇడ్లీ, దోశ వగైరా వంటకాలు చాలా రుచిగా ఉంటాయి

జీవన సౌరభం

స్థిరమైన గమ్యం, కచ్చితమైన మార్గం, రాజీలేని ప్రయత్నం ఉన్నప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలం.

ఇచ్చుటలో ఉన్న హాయి

శ్రవణ్, రవళి ఇద్దరూ మంచి స్నేహితులు. శ్రవణ్ దగ్గర మెరిసే కొత్త కారు బొమ్మ ఉంది. అతడికి ఆ బొమ్మంటే చాలా ఇష్టం. స్నేహితులతో ఆడుకునే సమయంలో కూడా బొమ్మను ఎవరికీ ఇచ్చేవాడు కాదు. చివరికి అతని ప్రాణ స్నేహితురాలు రవళికి కూడా ఇచ్చేవాడు కాదు. ఒకరోజు వారిద్దరూ పార్కులో ఆడుకుంటున్నారు.

"శ్రవణ్, ఒకసారి నీ కారు బొమ్మతో నేను ఆడుకోవచ్చా?" అంది రవళి.

"వద్దు, నేనివ్వను" అంటూ తన కారును గట్టిగా పట్టుకుని అక్కడ నుంచి శ్రవణ్ పారిపోయాడు. పరుగెడుతున్నప్పుడు కంగారులో జారిపడిపోయాడు. కారు బొమ్మ సమీపంలోని నీటి గుంటలో పడిపోయింది. దాన్ని అందుకోవడానికి చాలా ప్రయత్నించినా అది నీటిలో మునిగిపోయింది. దానితో చాలా బాధ పడుతూ కూర్చున్నాడు.

"శ్రవణ్! నీ బొమ్మ పోతే ఏమైంది.. నా బొమ్మలు తీసుకుని ఆడుకో" అని రవళి ఓదార్చుతూ తన బొమ్మలను ఇచ్చింది.

"నువ్వెంత మంచిదానివి రవళి! నేనెప్పుడూ నీకు నా బొమ్మ ఇవ్వక పోయినా ఈరోజు నాకు బొమ్మ ఇచ్చి ఓదార్చావు" అన్నాడు శ్రవణ్.

ఆ రోజు శ్రవణ్ "ఏదైనా పంచుకుంటే ఆనందం కలుగుతుంది. స్వార్థంగా ఉంటే ఒంటరితనం మిగులుతుంద'న్న ఒక విలువైన పాఠాన్ని నేర్చుకున్నాడు.

- కె.వి.సుమలత,
94926 56255

పదాలు జోడించండి

క్రీం, చెక్క, గంట, మేషాలు, వాన, కవ్వం, జామ్, కర్ర, వాన, గుత్తి, లడ్డు, బండి

బడి--	ఐస్-
తోపుడు--	గులాబ్--
గంధం--	రవ్వ--
అప్పడాల--	గాలి--
మజ్జిగ--	మీన---
పప్పు--	ఎండా--

పిల్లలూ, ఈ కింద ఇచ్చిన పదాలకు సరిగ్గా సరిపోయే పదాలను జోడించండి. అర్థవంతమైన పదాలను రాయండి. క్లూస్ ఇచ్చాం చూడండి.

నేను గీసిన బొమ్మ

ఎల్.మహేష్,
7వ తరగతి,
ఎస్‌కెవిటి హైస్కూల్,
రాజమహేంద్రవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లలకు కొత్త నైపుణ్యాలు నేర్పిద్దాం

ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఉన్న మనతోపాటుగా ప్రపంచమంతా ఉరుకులు పరుగులతో కూడిన జీవితంలో సతమతమవుతున్నాం. కెరీర్, ఉద్యోగం, వ్యాపారం ఇలా కారణాలేమైనా వాటిని అందుకునే క్రమంలో పిల్లల పట్ల ఒకింత నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూనే ఉన్నాం. వాళ్లే స్వయం శక్తితో ఎదుగుతారనే భరోసా కావొచ్చు. ప్రతిదీ నేర్చుకుంటారనే నమ్మకమైనా ఉండొచ్చు. ఇంటిల్లిపాదీ ఇలా ఉరుకులు పరుగులు తీస్తున్న క్రమంలో పిల్లల చదువు, పెంపకం, ఆరోగ్యం ఇలా అనేక అంశాలు ప్రభావితం అవుతూనే ఉన్నాయి. తల్లిదండ్రులు బిజీగా గడుతున్న సమయంలో పిల్లలు మొబైల్‌ఫోన్లకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారుతున్నారు.

ఏదో కొద్దిసేపైతే ఫర్వాలేదు. ఖాళీ దొరికినప్పుడల్లా ఫోన్లతో వాళ్లు కూడా గడిపేస్తుండటం నేడు అన్నిచోట్లా చూస్తున్నాం. ఫోన్ లేదా టీవీలకు పిల్లలు అతుక్కుపోవటం కొంచెం ఆందోళన కల్గించే విషయమే. ఫలితంగా రొటీన్ పనుల చట్రంలో ఇరుక్కుపోయి స్థూలకాయులు, మందమతులుగా పిల్లలు మారిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ఎవ్వరినీ నిందించాల్సిన అవసరం లేదు.

నేటి రోజుల్లో ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం తెలిసిందే. లేనిపక్షంలో కుటుంబ జీవనం గడవటం కష్టమవుతోంది.

ఈ క్రమంలో పిల్లల పెంపకం విషయంలోనూ కాసింత ఓపిగ్గా తల్లిదండ్రులు కొంత శ్రద్ధ తీసుకుని వారిని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. తాము బిజీగా ఉంటున్నామనే పేరుతో పిల్లల పెంపకం, వారి జీవన విధానాన్ని గాలికొదిలేస్తే ఆ ప్రభావం వారి పెంపకం, వృద్ధి, వికాసంపై కూడా పడుతుంది. ప్రతిరోజూ ఎంతోకొంత సమయం పిల్లలకు కేటాయిస్తే వారి ఇబ్బందులు, సమాజపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు, చదువుపరంగా కావాల్సిన అవసరతలు తెలుసుకుని పరిష్కరించటానికి అవకాశం ఉంటుంది. మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రాబోతున్నాయి. ఈ సెలవుల్లో తమ పిల్లల ఆసక్తులను తెలుసుకుని, గమనించి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదోఒక కొత్త నైపుణ్యాలను నేర్పిస్తే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అవకాశం ఉంటుంది.

నైతిక విలువలు : పిల్లలకు నీతికథలు, సూక్తులు, జాతీయాలు, మంచీచెడు గురించిన విచక్షణ గురించి సవివరంగా తెలియజేయాలి. ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? కుటుంబంలోని పెద్దల పట్ల ఎలా ఉండాలనేది తెలియజేయాలి.

స్వయంగా నేర్చుకోవాలి : చిన్న కుటుంబాలు కావటంతో సమయంలేక పిల్లలకు ఫోన్లు ఇచ్చేస్తున్నాం. వారు యాంత్రిక జీవితానికి అలవాటు పడుతున్నారు. స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉండటం లేదు. యానిమేటెట్ లోకమే నిజమనుకునే పరిస్థితి ఉంది. ఇలా కాకుండా వారితో మమేకమై కొత్త విషయాలు నేర్పించాలి.

సృజనాత్మకత : పిల్లల్లో ఆల్‌రౌండ్ అభివృద్ధి చెందాలంటే వారి వయస్సుకు సరిపడినంత ఆలోచనా శక్తిని పెంపొందించాలి. తార్కికంగా ఆలోచించేలా ప్రోత్సహించాలి. సృజనాత్మకను తట్టి లేపాలి. కష్టం, సుఖం, లాభం, నష్టం, ఆనందం, దు:ఖం, గెలుపు, ఓటములు అనే నిజ జీవితాన్ని పరిచయం చేయాలి.

బాధ్యతను గుర్తుచేయాలి : కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల పాత్రల గురించి తెలియజేయాలి. వారి పట్ల ఎలా నడుచుకోవాలో వివరించాలి. క్రమశిక్షణగా ఉంటే ఒనగూరే ప్రయోజనాలు, లోపిస్తే వచ్చే దుష్పరిణామాలు తెలపాలి. ఏరోజు పాఠాలు అదేరోజు చదివేయటం, హోంవర్కులు పూర్తిచేయటం వంటివి ప్రోత్సహించాలి. దైనందిన కార్యక్రమాల్లో అలసత్వం ప్రదర్శించకుండా చూడాలి.

విచక్షణ పెంపొందించాలి : జీవితం అంటే అన్ని కల గలిపిన నిజ ప్రపంచమని పిల్లలకు తెలియజేయాలి. బయటా లేదా ఇంట్లో ఉన్న పెద్దవారితో పిల్లలను మాట్లాడించాలి. తద్వారా పిల్లలు జ్ఞానవంతులు అవటమే కాకుండా భాషా సంపదను కూడా వృద్ధి చెందించే వారవుతారు.

మానసిక వికాసం : పిల్లలు నేడు ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో మేధా సంపత్తిలోపం ఒకటి. దీని కోసం ఆటలు ఆడించాలి. చదరంగం (చెస్), చిన్న చిన్న గణిత ప్రశ్నల సాధన, ఏక చలరాశిలో సమీకరణాల సాధన, చతుర్విధ ప్రక్రియల మీద సాధన, గణన సామర్థ్యం అత్యంత ఆవశ్యమైంది. వీటిని నేర్పటం ద్వారా పిల్లలో ఆలోచనా శక్తి మెరుగుపడుతుంది.

తార్కికశక్తి పెరుగుదల : పిల్లలకు తర్కపరమైన జ్ఞానాన్ని వృద్ధి చెందేలా కృషిచేయాలి. సుడోకో, పదకేళి, పద చదరాలు, సంఖ్యా చదరాలు, పొడువు, విడుపులను నేర్పించటం ద్వారా వారికి తార్కిపరమైన ఆలోచనాశక్తి పెరుగుతుంది. తద్వారా జీవితంలో ఎదురయ్యే ఎంత పెద్ద సమస్యకైనా తార్కిక ఆలోచనా శక్తి దాని ద్వారా పరిష్కరించుకునే సామర్థ్యం అభివృద్ధి చెందుతుంది.

వ్యర్థాలతో పరికరాలు : ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో అందమైన కళాకృతులను రూపొందించటం నేర్పించాలి. పగిలిన గాజులతో దండలుగా తయారుచేయడం, చరవాణిలకు స్టాండులను తయారు చేయటం, అట్టముక్కలతో చిన్న ఆకారాలను గణిత నమూనాలను చేయించటం మంచిది.

ఉద్వేగాల నియంత్రణ : జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కోవటానికి ప్రధానంగా మన పిల్లల చేత వైకుంఠపాళీ ఆటను ఆడించటం మంచిది. తద్వారా వారికి గెలుపు ఓటములపై అవగాహన, కష్టం ఎదురైనప్పుడు నిలదొక్కుకోగలిగిన శక్తి, నష్టం ఎదురైనప్పుడు తట్టుకునే ధైర్యం, జీవితంలో ఏదైనా సాధించాలనే ఆసక్తి పెంపొందుతుంది.

శ్రమించే అలవాటు : శ్రమ జీవనాన్ని చిన్నతనం నుంచి అలవాటుగా మార్చాలి. పది సంవత్సరాల దగ్గర పడిన పిల్లలకు వారి దైనందిన కార్యక్రమాలను వారే చేసుకునేలా ప్రోత్సహించాలి. కౌమార దశలోని పిల్లలను అవసరమైతే బయట పనులకు పంపించటం ద్వారా మంచిచెడూ విచక్షణ తెలుస్తుంది. బయట పనులకు పంపటానికి వీలుకాని సందర్భంలో ఇంట్లో తోట పెంపకం పనులనైనా నేర్పాలి. తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతోపాటుగా ప్రకృతిలో మమేకమవుతారు.

కళలపై ఆసక్తి : సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, కవిత్వం, శిల్పనిర్మాణం వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలి. చక్కని దస్తూరి కోసం చేతిరాత నేర్పించటం, పఠన అవగాహనపై చందమామ, ఇతర కథలను చదివించటం మేలు.

స్వీయ రక్షణ : స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇప్పించటం ద్వారా మానసిక ఆందోళనలు తగ్గుతాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం వంటి క్లాసులకు సైతం హాజరుకావొచ్చు.

- పగిడిపల్లి లక్ష్మీనిరంజన్ కుమార్,
ఎమ్మెస్సీ, ఎంఇడి, గణిత అధ్యాపకులు,
చనుబండ, చాట్రాయి మండలం,
ఏలూరు జిల్లా.
సెల్ : 81797 47947

విద్యుత్ రంగంపై ప్రైవేటీకరణ దాడులను ప్రతిఘటించాలి

సిపిఎం మహాసభ డిమాండ్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడానికి చేసున్న యత్నాలపై సిపిఐ(ఎం) 24వ మహాసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహాసభలో ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని సుదీప్ దత్తా ప్రవేశపెట్టగా, ప్రమోద్ ప్రధాన్ బలపరిచారు. ఈ తీర్మానం ఇంకా ఇలా పేర్కొంది. లాభదాయకమైన, సమర్ధవంతమైన, తక్కువ టారిఫ్‌లు కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను బలవంతంగా ప్రైవేటీకరించారు. గత 130 రోజులుగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్న ఉత్తర ప్రదేశ్‌లోని విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకు యత్నిస్తున్నారు. దీనిని బట్టి రాష్ట్ర డిస్కామ్‌లను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎంతగా తహతహలాడుతున్నదో తెలుస్తోంది. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ప్రక్రియను రూపొందించేందుకు మొన్న ఫిబ్రవరి 20న వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కేంద్రం ప్రత్యేక ప్రాంతీయ సమావేశం నిర్వహించింది. ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లు కొత్త ముసాయిదాను తీసుకువస్తోంది. ఈ దాడులు కేంద్ర ప్రభుత్వ బహుముఖ ప్రైవేటీకరణ యత్నాల్లో ఒక చిన్న భాగం మాత్రమే. ఇప్పటికే భారత దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్ధ్యంలో 52 శాతం ప్రైవేట్ చేతుల్లో ఉంది. అదనంగా దేశీయ ధర కంటే మూడు రెంట్లు అధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశం ప్రభుత్వ యాజమాన్యంలోని విదుత్ సంస్థలను ప్రమాదంలో పడేస్తోంది. దాదాపు 80 శాతం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు నేడు ప్రైవేట్ సంస్థల నియంత్రణలో ఉన్నాయి. మోడీ ప్రభుత్వం అపరిమితమైన భూమిని కార్పొరేట్లకు కానుకగా ఇస్తోంది. ఇది చాలదన్నట్లు అనేక ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెడుతోంది. పునరుత్పాదక ఇంధన అభివృద్ధిని సులభతరం చేయడానికి లిథియం, కోబాల్ట్ వంటి కీలకమైన ఖనిజాలను ప్రైవేట్ వారికి అప్పగిస్తోంది.నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పథకం కింద ఎన్‌టిపిసి, ఎన్‌హెచ్‌పిసి ప్రారంభించిన పునరుత్పాదక ప్రాజెక్టులను కూడా ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోంది. పవర్ గ్రిడ్ నెట్‌వర్కులో ఆరవ వంతు ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. సబ్ స్టేషన్ల నిర్వహణను అవుట్ సోర్సింగ్ చేయాలని ఆదేశించింది. వినాశకరమైన టోటెక్స్ మోడల్ ప్రి పెయిడ్ స్మార్ట్ మీటరింగ్ ప్రాజెక్టును తీసుకొస్తున్నది. తద్వారా ప్రతి వినియోగదారుడి ద్యుత్ బిల్లులకు సంబంధించి మార్కెట్ శక్తులపై ఆధారపడేలా చేస్తుంది. ప్రతి వినియోగదారుడు జీవితకాలంలో ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్‌కు రూ.8 వేల నుంచి 12 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేసిన వెంటనే అందరు వినియోగదారులను టైమ్ ఆఫ్ డే టారిఫ్ పరిధిలోకి తీసుకొస్తారు. సాయంత్రం గరిష్ట డిమాండ్ సమయంలో విద్యుత్ ధర చాలా ఎక్కువగా ఉంటుంది. దీంతోబాటు భారత దేశంలో సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించుకున్న క్రాస్ సబ్సిడీని ఉపసంహరించుకోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌కు మారడం ద్వారా నిజమైన సాగుదారులు, భూమిలేనివారు, కౌలుదారులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. మన ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అంతేకాదు, మన సమాఖ్య వ్యవస్థపై కూడా దాడి చేస్తుంది. కాబట్టి ఈ ప్రైవేటీకరణ దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యుత్ ఉద్యోగులతో కలిసి అందరూ సమైక్యంగా పోరాడాలని సిపిఎం మహాసభ పిలుపునిచ్చింది.

నా ఫేవరెట్ హీరో జూనియర్ ఎన్టీఆర్ : హృతిక్‌రోషన్

'జూనియర్ ఎన్టీఆర్ నా ఫేవరెట్ కోస్టార్. ఆయన అద్భుతమైన తెలివైనవాడు. 'వార్ 2' సినిమా ఒక పాట మినహా మిగతా షూటింగ్ అంతా పూర్తయ్యింది. ఆ పాటలో ఎన్టీఆర్‌తో కలిసి డాన్స్ చేయాలంటే కాస్త భయంగా ఉంది. ఆయన ఎలాగైనా చేయగలడు. నేను కూడా బాగా డ్యాన్స్ చేస్తానని అనుకుంటున్నాను. మీరు మా సినిమాను తప్పక ఆదరించాలి' అని బాలీవుడ్ కథానాయకుడు హృతిక్‌రోషన్ కోరారు. జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ తీస్తున్న 'డ్రాగన్' సినిమాలో బిజీగా ఉన్నారు. 'వార్ 2'లో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. జార్జియాలో జరిగిన వార్ 2 ఈవెంట్‌లో హృతిక్‌రోషన్ పై విధంగా మాట్లాడారు. వార్ 2కు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా యశ్‌రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ సినిమాతో

'రేయి లోలోతుల' అంటున్న రష్మిక

రష్మిక మందన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా నుంచి తాజాగా టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల' విడుదలైంది. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం సాంగ్‌తో పాటు కొత్త పోస్టర్‌ని కూడా విడుదలచేశారు. దీక్షిత్ శెట్టి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. రాకేందు మౌళి ఈ సాంగ్‌కి సాహిత్యం అందించారు. విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీపాద ఈ పాటను ఆలపించారు. ఈ పాటలోని కవితను దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రచించారు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సినిమాని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

'ప్రియమారా..' పాట విడుదల

ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న రెండో సినిమా 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి'. ఈ సినిమా నుంచి మరోపాట విడుదలైంది. రథన్ స్వరాలు అందించారు. ఈనెల 11న ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి టీజర్, ట్రైలర్‌తోపాటుగా లిరికల్ సాంగ్ కూడా విడుదలయ్యాయి. శనివారంనాడు ఈ సినిమా నుంచి 'ప్రియమారా... మౌనాల చాటు మాటలే తెలియదా' అంటూ సాగే పాటను నిర్మాతలు విడుదల చేశారు. ఈ పాటకు రథన్ స్వరాలు సమకూర్చగా, రాకేంద్ర మౌళి సాహిత్యాన్ని అందించారు. శరత్ సంతోష్, లిప్సికా భాష్యం పాడారు. సివిల్ ఇంజనీర్‌గా ప్రదీప్ ఇందులో నటించారు. అతని సరసన దీపికా పల్లి కథానాయికగా నటించారు. నితిన్, భరత్ ద్వయం తెరకెక్కించారు.

'గుడ్ బ్యాడ్ అగ్లీ' ట్రైలర్ విడుదల

అజిత్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈనెల 10న ఈ సినిమా విడుదల కానుంది. తమిళంలో ట్రైలర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ సినిమాను నిర్మించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాలో సిమ్రాన్, ప్రభు, ప్రసన్న, అర్జున్‌దాస్, సునీల్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.

చెపాక్‌లో మళ్లీ ఓడిన చెన్నై

- కెఎల్ రాహుల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు హాట్రిక్ విజయాలు

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్‌కు చెపాక్ స్టేడియంలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో చెన్నై జట్టు 25 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఢిల్లీ నిర్దేశించిన 184 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేసింది. విజయ్ శంకర్ 54 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఎంఎస్ ధోనీ 26 బంతుల్లో 30 పరుగులు చేసి నాటౌట్ నిలిచాడు. పెరిగిపోతున్న రన్ రేట్ ను అందుకోవడంలో విజయ్ శంకర్, ధోనీ విఫలమయ్యారు. వీరిద్దరూ క్రీజులోనే ఉన్నప్పటికీ... భారీ షాట్లు కొట్టలేక చెన్నై అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేశారు. ఓపెనర్లు రచిన్ రవీంద్ర 3, డెవాన్ కాన్వే 13, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులు చేసి అవుటయ్యారు. శివమ్ దూబే (18), రవీంద్ర జడేజా (2) స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో విప్రాజ్ నిగమ్‌కు రెండు, మిచెల్ స్టార్క్, మహేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 183 పరుగులు చేసింది. కెప్టెన్ కెఎల్ రాహుల్(77), అభిషేక్ పోరెల్(33), స్టబ్స్(24), అక్షర్(21) బ్యాటింగ్‌లో రాణించారు. చెన్నై బౌలర్లు ఖలీల్ అహ్మద్‌కు రెండు, జడేజా, నూర్ అహ్మద్, పథీరనకు ఒక్కో వికెట్ దక్కాయి. కాగా, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా మూడో విజయం. దీంతో ఢిల్లీ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కెఎల్ రాహుల్‌కు దక్కింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	3	3	0	6	+1.25
బెంగళూరు	3	2	1	4	+1.14
గుజరాత్	3	2	1	4	+0.80
పంజాబ్	3	2	1	4	+0.07
కోల్‌కతా	4	2	2	4	-1.42
లక్నో	4	2	2	4	+0.04
రాజస్తాన్	4	2	2	4	-0.18
ముంబయి	4	1	3	2	+0.10
చెన్నై	4	1	3	2	-0.89
సన్‌రైజర్స్	4	1	3	2	-1.61

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: జాక్ ఫ్రేజర్ (సి)అశ్విన్ (బి)ఖలీల్ అహ్మద్ 0, కెఎల్ రాహుల్ (సి)ధోని (బి)పథీరన 77, అభిషేక్ పోరెల్ (సి)పథీరన (బి)జడేజా 33, అక్షర్ పటేల్ (బి)నూర్ అహ్మద్ 21, సమీర్ రిజ్వి (సి)జడేజా (బి)ఖలీల్ అహ్మద్ 20, స్టబ్స్ (నాటౌట్) 24, అషుతోష్ శర్మ (రనౌట్)జడేజా/ధోనీ 1, విప్‌రాజ్ నిగమ్ (నాటౌట్) 1, అదనం 6. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 183పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/54, 3/90, 4/146, 5/179, 6/180 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-25-2, ముఖేష్ చౌదరి 4-0-50-0, అశ్విన్ 3-0-21-0, జడేజా 2-0-19-1, నూర్ అహ్మద్ 3-0-36-1, పథీరన 4-0-31-1.

చెనై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ రవీంద్ర (సి అండ్ బి)ముఖేష్ కుమార్ 3, కాన్వే (సి)అక్షర్ (బి)విప్‌రాజ్ నిగమ్ 13, గైక్వాడ్ (సి)ఫ్రేజర్ (బి)స్టార్క్ 5, విజయ్ శంకర్ (నాటౌట్) 69, శివమ్ దూబే (సి)స్టబ్స్ (బి)విప్‌రాజ్ నిగమ్ 18, జడేజా (ఎల్‌బి)కుల్దీప్ యాదవ్ 2, ధోనీ (నాటౌట్) 30, అదనం 18. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 158పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/20, 3/41, 4/65, 5/74 **బౌలింగ్:** స్టార్క్ 4-0-27-1, ముఖేష్ కుమార్ 4-0-36-1, మోహిత్ శర్మ 3-0-27-0, విప్‌రాజ్ నిగమ్ 4-0-27-2, కుల్దీప్ యాదవ్ 4-0-30-1, అక్షర్ పటేల్ 1-0-5-0

ఐపిఎల్‌లో నేడు

సన్‌రైజర్స్ హైదరాబాద్ × గుజరాత్ జెయింట్స్
వేదిక: హైదరాబాద్; రాత్రి 7.30గం॥లకు

రాజస్తాన్ సునాయాసంగా..

పంజాబ్‌పై 50 పరుగుల తేడాతో గెలుపు

ఛండీగఢ్: రాజస్తాన్ జట్టు ఈ సీజన్ ఐపిఎల్‌లో రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. పంజాబ్ కింగ్స్‌తో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు 50 పరుగుల తేడాతో సునాయాసంగా గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 205పరుగులు చేయగా.. ఛేదనలో భాగంగా పంజాబ్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులే చేయగల్గింది. పంజాబ్ జట్టులో నేహల్ వధేరా(62) అర్ధసెంచరీకి తోడు మ్యాక్స్‌వెల్(30) బ్యాటింగ్‌లో రాణించారు. రాజస్తాన్ బౌలర్లు జోఫా ఆర్చర్‌కు మూడు, సందీప్ శర్మ, తీక్షణకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జోఫ్రా ఆర్చర్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా..)

రాజస్తాన్ రాయల్స్: 205/4(20 ఓవర్లలో) జైస్వాల్ 67, రియాన్ పరాగ్ 43(నాటౌట్), (ఫెర్గూసన్ 2/37, అర్షదీప్ 1/35)

పంజాబ్ కింగ్స్: నేహల్ వధేరా 62, మ్యాక్స్‌వెల్ 30; (ఆర్చర్ 3/25, సందీప్ శర్మ 2/21)

ఈషా సింగ్‌కు రజతం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్

బ్యూన్‌ఎయిర్(అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో ఈషా సింగ్ రజత పతకంతో సత్తా చాటింది. శనివారం జరిగిన 25మీ. పిస్టోల్ విభాగంలో 20ఏళ్ల ఈషా సింగ్ 35పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది. ఇక సన్ యూజీ 38పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం, ఫెంగ్ షియాన్(30పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. భారత స్టార్ షూటర్ మను భకర్ 6వ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో భారత్‌కు ఒక్కో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కాయి.

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ

ఏచూరి మళ్లీ వచ్చారు!

సోషలిజమే ప్రత్యామ్నాయమని చెప్పారు

స్ఫూర్తిని రగిలించిన డాక్యుమెంటరీ

సీతారాం ఏచూరి నగర్ (మదురై)నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

సీతారాం ఏచూరి... మళ్లీ వచ్చారు! అశేషంగా ఉన్న పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, అభిమానుల కేరటాల మధ్య కారు నుంచి దిగారు. దిగీ దిగగానే తనదైన శైలిలో 'సోషలిజమే నిజమైన ప్రత్యామ్నాయం' (సోషలిజం ఈజ్ ది ఆల్టర్నేటివ్) అని చెప్పారు. ఒక్కసారిగా అభిమాన నేత తమ మధ్య కనపడటంతో అక్కడ హర్షధ్వానాలు మారుమ్రోగాయి. 'సీతారాం అమర్‌రహే' నినాదాల హోరు వినిపించింది. సిపిఎం అఖిల భారత మహాసభ సందర్భంగా మధుర తముక్కం మైదానంలో ఉన్న జానకీ అమ్మాళ్ వేదికలో జరిగిన 'సీత' డాక్యుమెంటరీ ప్రదర్శన సందర్భంగా కనిపించిన దృశ్యాలివి!

ఈ ప్రదర్శన సందర్భంగా ఆ హాలు ప్రజలతో కిక్కిరిసి పోయింది. వారు వినిపించిన నినాదాలతో మార్మోగిపోయింది. సిపిఎం తమిళనాడు రాష్ట్ర కమిటీకి చెందిన 'కామ్రేడ్ టాకీస్' మీడియా బృందం ఈ డాక్యుమెంటరీని రూపొందించింది. డాక్యుమెంటరీ ఏచూరితో ఇంటర్వ్యూతో ప్రారంభమవుతుంది. ఏచూరి సహజంగా ప్రసంగాన్ని ప్రారంభించే విధంగానే అది 'ఎల్లార్కుమ్ వణక్కమ్' అన్న తమిళ సంబోధనతో ప్రారంభమైంది. తరువాత 'ఉంగళ్ అనుమతియోడ నాన్ ఇంగ్లీష్‌ల పేసలామెన్' (మీ అనుమతితో నేను ఇంగ్లీష్‌లో మాట్లాడాలని అనుకుంటున్నాను) అనే చేసే అభ్యర్థన వినపడింది. ఆ తరువాత తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. భారతదేశ లౌకిక స్వభావాన్ని కాపాడడం గురించి, మితిమీరుతున్న హిందూత్వ శక్తుల దాడుల గురించి ప్రస్తావించారు. ఏచూరి నేరుగా వచ్చి మాట్లాడుతున్నట్టుగానే ఈ డాక్యుమెంటరీ అనుభూతి కలిగించింది.

సాంస్కృతిక రంగంలో ఆర్‌ఎస్‌ఎస్ జోక్యాన్ని తిప్పికొట్టడానికి ఏచూరి చేసిన పోరాటం, పార్లమెంటులో పోరాటాలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం ఆయన చూపిన చొరవ తదితర అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపెట్టారు. వేలాది మంది అశ్రునివాళుల మధ్య జరిగిన ఆయన అంతిమ ఊరేగింపుతో ఈ డాక్యుమెంటరీ ముగిసింది. 'ఐ కన్వే మై థాంక్స్ టు ఆల్. రెడ్ సెల్యూట్ టు ఎవరిబడీ' అన్న ఏచూరి మాటలను చివరగా వినిపించారు. ఆ వెంటనే "మీ శ్రమ, త్యాగాలను శ్రమజీవులు ఎన్నటికీ మర్చిపోరు' అనే అర్థంతో సాగే తమిళ పాట, దృశ్యాలను జోడించి, గొప్ప స్ఫూర్తిని, భావోద్వేగాన్ని రగిలించారు. దీనిని కామాచ్చిరామన్ నేతత్వంలోని ఐదుగురు సభ్యుల బందం రూపొందించింది. స్క్రిప్ట్, వాయిస్- ఓవర్: నర్మద. 'కామ్రేడ్ టాకీస్' యూట్యూబ్ ఛానల్‌లో కూడా ఈ డాక్యుమెంటరీని అప్‌లోడ్ చేశారు.

మీడియా సెంటర్లో ఏచూరి తలపులు

సీతారాం ఏచూరికి మీడియా ప్రతినిధులకు ఉండే స్నేహ సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన ఎక్కడ మీడియా సమావేశం నిర్వహించినా, ఆ సమావేశం ముగిసిన పాత్రికేయులతో ప్రత్యేకంగా మాట్లాడేవారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకునేవారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా పేర్లతో సహా కొందరు పాత్రికేయులను గుర్తుంచుకోవడం ఆయన ప్రత్యేకత! అందుకే పాత్రికేయులు కూడా ఆయన పట్ల ప్రత్యేక అభిమానం చూపేవారు. సమావేశాల్లో ఆయన చుట్టూ మూగిపోయేవారు. రకరకాల ప్రశ్నలు వేసేవారు. ఎంత ఇబ్బంది పెట్టే ప్రశ్నకైనా సీతారాం చిరునవ్వుతో జవాబు చెప్పేవారు. 24వ మహాసభ ఆయన ప్రసంగానికి బదులుగా, ఆయనపై పెట్టిన సంతాప తీర్మానంతో ప్రారంభమైంది. మహాసభ నిర్ణయాలు తెలపడం కోసం ఏర్పాటు చేసిన మీడియా సెంటర్లో ఈ అంశాలన్నీ ప్రస్తావనకు వచ్చాయి. పలువురు పాత్రికేయులు ఏచూరితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

తీర్మానం ప్రవేశపెడుతున్న రామచంద్రడోమ్ ; ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు

• సిపిఎం డిమాండ్ • ఉదారవాద విధానాలతో సామాజిక న్యాయానికి గండి అని ఉద్ఘాటన

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో సభ్యుడు రామచంద్రడోమ్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఇష్వాకర్ రహమాన్ బలపరిచారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తున్నట్లు ఈ తీర్మానంలో పేర్కొన్నారు. 'సమాజంలోని అణచివేతకు గురైన షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసిలు) ఇప్పటికీ సామాజిక వివక్షకు, విస్మరణకు గురవుతూనే ఉన్నారు. పేదరికం, వివక్ష కులాల ఆధారంగా ఏర్పడిన సామాజిక నిర్మాణంలో ప్రధాన భాగంగా ఉన్నాయి. భూమి లేకపోవడం, వివిధ వృత్తుల్లో ప్రవేశించే అవకాశాల్లో ఆంక్షలు, విద్యకు నిరాకరణ వంటి అంశాల కారణంగా వీరికి ఆర్థికంగా ఎదగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'రిజర్వేషన్లు ఈ కులాల ఆర్థిక విస్మరణను ఎదుర్కోవడంలో అత్యంత కీలకంగా మారాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15 (4), 16(4), 46, 335 ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడానికి మార్గం ఏర్పడింది. ఈ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమిత మయ్యాయి. అందులోనూ అమలులోనూ తీవ్ర లోపాలు జరిగాయి. రిజర్వ్ చేసిన ఉద్యోగాలు అనేకం ఖాళీగా ఉన్నాయి. 2023లోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయి. వీటిలో అత్యధికం రిజర్వ్‌డ్ ఉద్యోగాలే. రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి! నూతన సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ప్రభుత్వరంగ ఉద్యోగాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. 1990లలో సుమారు 2 కోట్లు ప్రభుత్వ ఉద్యోగాలు (కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు, అర్ధ-ప్రభుత్వ రంగాలు కలిపి) ఉండగా, 2012 నాటికి ఈ సంఖ్య 1.7 కోట్లకు పడిపోయింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిణామం మరింత వేగంగా జరిగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలపై వివరాలను ప్రచురించడం మానేసింది. అయినప్పటికీ, రైల్వేలు, పోస్టులు, బ్యాంకులు వంటి రంగాల్లో ఉద్యోగాలు పెద్దఎత్తున తగ్గినట్లు గణాంకాలు చూపుతున్నాయి. 1990ల మధ్యకాలంలో పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 10 లక్షలకు పైగా ఉద్యోగులు ఉండగా, 2024 నాటికి ఇది 7.5 లక్షలకు తగ్గిపోయింది. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 4.5 లక్షల ఉద్యోగాలు తగ్గాయి (అంటే 35% తగ్గుదల). రైల్వేలో 80 వేలు , పోస్టల్ శాఖలో 40 వేలు, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 90 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదల అధికంగా గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాల్లో ఉంది. 2014- 2023 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంలో తగ్గిన ఉద్యోగాల్లో 86% ఈ ఉద్యోగాలే. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియమాకాలు వీటిలోనే ఎక్కువ జరిగాయి. విద్యారంగ ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియామకాలు పెరగలేదు. ఫలితంగా ఎస్సీ/ ఎస్టీ ఉపాధ్యాయుల నిష్పత్తి భారీగా తగ్గింది. 2023-24లో ఎస్‌టి ఉపాధ్యాయులు కేవలం 7.7%, ఎస్సీ ఉపాధ్యాయులు 12.6% మాత్రమే ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కులాల ఉపాధ్యాయులకు అవకాశం మరింత తక్కువగా ఉంది.' అని తీర్మానం పేర్కొంది. "నూతన ఉదారవాద విధానాల్లో ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం ప్రధానంగా ఉన్నాయి. ఇవి ఉపాధి అవకాశాలను అసంఘటిత రంగానికి తరలించాయి. ఫలితంగా రిజర్వేషన్లు సామాజిక న్యాయం సాధించే సాధనంగా ఉండలేకపోయాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగం మొత్తానికి రిజర్వేషన్లను వర్తింపచేయాలని, అన్ని గుర్తింపు పొందిన సంస్థలకు విస్తరించాలని సిపిఎం తీర్మానంలో డిమాండ్ చేసింది.

'వ్యవసాయ మార్కెటింగ్' పాలసీతో ముప్పు

ఉపసంహరణకు సిపిఎం డిమాండ్

సీతారాం ఏచూరినగర్ (మదురై)నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

వ్యవసాయ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు 24వ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కృష్ణప్రసాద్ ప్రవేశపెట్టగా, కేంద్ర కమిటీ సభ్యులు కరుమాల్యాన్ బలపరిచారు. "పోరాడుతున్న రైతు ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా, కొత్తగా తీసుకువస్తున్న ఫ్రేమ్ వర్క్ పాలసీ రైతులపై కార్పొరేట్ దాడిని మరింత ఉధృతం చేసే ప్రయత్నం. దీనిని మహాసభ తీవ్రంగా ఖండిస్తోంది. రైతుల పోరాటాల కారణంగా రద్దైన వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన తీసుకువచ్చే కుట్ర ఇది. రైతుల ప్రధాన డిమాండ్లయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ, సమగ్ర పంటల బీమా, వ్యవసాయంపై ప్రభుత్వ పెట్టుబడుల పెంపు, రుణ సౌకర్యాలు వంటి వాటిని పట్టించుకోకుండా ఈ ముసాయిదాను తీసుకొచ్చారు. రాజ్యాంగంలోని 246వ ఆర్టికల్ ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర అంశం అయినా కూడా కేంద్రం దీనిని తీసుకొచ్చి, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే యత్నం చేస్తోంది. ప్రభుత్వ మార్కెట్ యార్డులను రద్దు చేయాలని, సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయాలని, చిన్న, మధ్యస్థ రైతులను ప్రైవేట్ వ్యాపార దోపిడికి అప్పచెప్పాలని చూస్తోంది." అని తీర్మానం పేర్కొంది.

తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న కృష్ణప్రసాద్

"ప్రైవేట్ హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, కార్పొరేట్ సంస్థలు నేరుగా రైతుల నుంచి పొలాల దగ్గరే కొనుగోలు చేయడం, సంప్రదాయ మార్కెట్ యార్డులను కార్పొరేట్ గోదాములుగా మార్చడం, రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత మార్కెట్ ఫీజు, లైసెన్స్ విధానం తీసుకురావడం వంటివి నూతన ప్రతిపాదనల్లో ఉన్నాయ"ని తీర్మానంలో పేర్కొన్నారు.

పంజాబ్‌లో లుధియానా, హర్యానాలో సిర్సాలో ఇప్పటికే రిలయన్స్, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలు పెద్దయెత్తున గోదాములు, ప్రైవేట్ రైలు ట్రాకులు నిర్మించాయని, ఇది రైతులను కార్పొరేట్లకు అప్పచెప్పడమేనని తీర్మానంలో తెలిపారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, బ్రాండింగ్‌తో పాటు మిగతా ప్రక్రియలు చేసి ఎక్కువ లాభాలు పొందే వ్యూహం దీని వెనక ఉందని, ఇది రైతులను, వినియోగదారులను దోచుకునే విధానమేనని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన వల్ల రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరుగుతాయని, రైతాంగం మరింత పేదరికంలోకి నెట్టబడుతుందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కబ్జాకు వదిలిపెట్టడంతో పాటు, ప్రధాని మోడీ ప్రమోట్ చేస్తున్న కార్పొరేట్ సంస్థకు అప్పచెప్పే దుర్మార్గమైన వ్యూహం ఉందని, ఇది దేశంలో ఆహారకొరతకు దారి తీస్తుందని విమర్శించింది. దీనిని వెనక్కి తీసుకునేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని రైతులకు సిపిఎం మహాసభ పిలుపునిచ్చింది.

క్రైస్తవులపై పెరుగుతున్న 'సంఘ్' దాడులు

సీతారాం ఏచూరి నగర్ నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

సంఘ్ పరివార్ శక్తులు ఆంధ్రప్రదేశ్‌లో కొంత కాలంగా క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. గ్రామాలవారీగా చర్చిలు, క్రిస్టియన్ల వివరాలను సేకరించడానికి, వారికి వ్యతిరేకంగా ఇతరులను రెచ్చగొట్టడానికి సంఘ్‌పరివార్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజాశక్తి వెలుగులోకి తీసుకువచ్చింది. అయితే, మధ్యప్రదేశ్‌ను క్రైస్తవులపై దాడులకు ప్రయోగశాలగా సంఘ్ పరివార్ శక్తులు మార్చుకున్నాయని ఆ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి జశ్వీందర్ సింగ్ చెప్పారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, మధ్యప్రదేశ్‌లో సంఘ్‌పరివార్ శక్తులు చెలరేగిపోతున్న తీరును వివరించారు.

'జబల్పూర్‌లో విహెచ్‌పి గుండాలు మలయాళీ పాస్టర్లపై దాడి చేశారు. ఇది మైనారిటీలపై గత కొన్నేళ్లుగా జరుగుతున్న అణచివేతలకు కొనసాగింపే. మధ్యప్రదేశ్‌లో సాధారణంగా ముస్లింలు సంఘ్ పరివార్ దాడులకు గురవుతుంటారు. ఆదివాసీ ప్రాంతాల్లో మాత్రం ఇప్పుడు క్రైస్తవులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు.' అని ఆయన వివరించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా చురుకుగా పోరాడుతున్నట్లు చెప్పారు.

'2024 జనవరి 22న, ప్రధాని రామ్ మందిరాన్ని ప్రారంభించిన రోజే, జ్హబువా జిల్లాలో చర్చ్‌ను సంఘ్ పరివార్ కూల్చివేసింది. గోడలపై 'జై శ్రీరామ్' అని రాశారు. మరో చర్చ్‌పై కాషాయ జెండా ఎగురవేశారు. ఎప్పుడూ లేని విధంగా నర్మదా నదికి కుంభమేళా నిర్వహించి క్రైస్తవ చర్చ్‌లను ధ్వంసం చేశారు.' అని ఆయన తెలిపారు. 'దీని అర్థం ముస్లింలపై దాడులు జరగడం లేదని కాదు. వారిపై కూడా మరింత ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. దురదష్టకరమైన విషయం ఏమిటంటే, ఈ దాడుల సందర్భంలో పోలీసులు ప్రేక్షకులుగా ఉన్నారు. నిందితులను తప్పించేలా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఇండోర్ జిల్లాలోని మ్హౌ పట్టణంలో ఊరేగింపు సందర్భంగా ఒక మసీదు మీద దాడి జరిగింది. దాడిచేసినవారి పేర్లు ఇచ్చినా, ఎఫ్ఐఆర్‌లో 'గుర్తు తెలియని వ్యక్తులు' అని నమోదు చేశారు. అదే సమయంలో, 13 మంది ముస్లిం యువకులపై అబద్ధపు కేసులు బనాయించి, వారి ఇళ్లు బుల్డోజర్లు పంపించి కూల్చేశారు. ఇన్ని దాడులు జరుగుతున్నా సిపిఎం తప్ప బాధితుల తరపున మరే పార్టీ మాట్లాడటం లేద'ని అన్నారు.

జశ్వీందర్ సింగ్

నిర్విరామంగా వలంటీర్ల సేవలు

మహాసభ కోసం జనవరి నుంచే రంగంలోకి
గొప్ప అనుభూతిని మిగిల్చింది : వలంటీర్ల ఇన్‌చార్జి ఎ.వి.సింగార వేలన్

వేదికపై అవసరాలను సమకూరుస్తూ ...

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ఎక్కడా ఎలాంటి అవాంతరాల్లేకుండా మహాసభ సజావుగా సాగటంలో వారి పాత్ర కీలకం. అధ్యక్షవర్గం నుంచి పరిశీలకుడి దాకా ఎవరికి ఏ అవసరమొచ్చినా క్షణాల్లో తీరుస్తూ ఏ చిన్న అసౌకర్యం కలగకుండా చూస్తూ ఆ కామ్రేడ్లు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ నిర్విరామంగా సేవలందిస్తూ 'శభాష్' అనిపించుకుంటున్నారు. వారే వాలంటీర్లు. తమిళనాడులోని మదురైలో సీపీఐ(ఎం) 24వ మహాసభ నిర్వహణ కోసం వీరు జనవరి నుంచే రంగంలోకి దిగారు. దాదాపు మూడు నెలలపాటు శ్రమించి... నిధుల సమీకరణ, ప్రచారం, గోడల మీద రాతలు తదితర కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశారు. మహాసభ ప్రాంగణంలో సౌకర్యాలను కల్పించటం, వాటి నిర్వహణ, ప్రతినిధులకు స్వాగతం పలకటం, వారి బస, రవాణా, వివిధ ప్రదర్శనల ఏర్పాటు, వైద్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికల ఏర్పాట్లు తదితర

ఎ.వి.సింగార వేలన్

పనులను 425 మంది వలంటీర్లు తమ భుజాన వేసుకున్నారు. వీరిలో 50 మహిళా వాలంటీర్లు కూడా ఉన్నారు. తమిళనాడులోని అన్ని ప్రాంతాలకు చెందిన ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా సంఘాల నుంచి చురుకైన కార్యకర్తలను వాలంటీర్లుగా నియమించారు.

సిఐటియుకు చెందిన వంద మంది వలంటీర్లు రవాణా సౌకర్యాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరో వంద మంది వలంటీర్లు మహాసభ ప్రాంగణం, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం బాధ్యతలను చూస్తున్నారు. ప్రతినిధులు రావటానికి వీలుగా కాన్ఫరెన్సు హాల్‌కు ఉన్న ఆరు గేట్లు, ఒక విఐపి గేటు దగ్గర మరి కొంతమంది బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మరోవైపు ప్రతినిధుల సహాయార్థం ఇంగ్లీషు, హిందీ, తెలుగు, మళయాళం భాషలు తెలిసిన 30 మంది వలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం ప్రతినిధులు వచ్చేసరికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు వీలుగా ప్రతిరోజూ పది మంది వలంటీర్లను రాత్రి విధుల్లో నియమించారు. రొటేషన్ పద్ధతిలో రోజుకో బృందం ఈ రకంగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. మహాసభల కోసం పని చేయటం తమకు గొప్ప అనుభూతిని మిగిల్చిందని వలంటీర్ల ఇన్‌చార్జి ఎ.వి.సింగార వేలన్ తెలిపారు. పార్టీ, ప్రజా సంఘాల సమన్వయంతో తాము ఈ పనులన్నింటినీ జయప్రదంగా చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

ప్రతినిధులకు తీర్మానాల ప్రతులను పంచుతూ ...

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ

8 రోజులు.. 550 కిలోమీటర్లు...

- తిరుపతి నుంచి మదురైకి సైకిల్ యాత్ర
- చల్లా వెంకటయ్య, కుప్పస్వామికి ఘన స్వాగతం

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి
వారిద్దరికీ సిపిఐ (ఎం) అంటే ఎనలేని ప్రేమ. మహాసభలంటే విపరీతమైన ఇష్టం. ఆ ప్రేమ, ఇష్టమే... వారిని తిరుపతి నుంచి మదురై దాకా సైకిల్ యాత్ర చేపట్టేలా చేశాయి. ఆ కామ్రేడ్లే చల్లా వెంకటయ్య, కె.కుప్పస్వామి. వీరిలో వెంకటయ్య సిపిఐ (ఎం) చిత్తూరు జిల్లా మాజీ కార్యదర్శి కాగా, కుప్పస్వామి ప్రజాశక్తి మాజీ ఉద్యోగి. ఈ ఇద్దరూ మహాసభల కోసం మార్చి 29న తిరుపతిలో బయల్దేరారు. అక్కడి నుంచి సైకిల్ యాత్ర చేసుకుంటూ ఎనిమిదో రోజైన శనివారం మదురైకి చేరుకున్నారు. మొత్తం 550 కిలోమీటర్లు ప్రయాణించి, ఇక్కడి సీతారాం ఏచూరి నగర్ (మహాసభల ప్రాంగణం) నగర్‌కు చేరుకున్న వీరికి సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తిరుపతిలో బయల్దేరిన దగ్గర్నుంచి మదురై దాకా ప్రతిచోటా తమకు భోజనం, బస, వసతి ఇతర సౌకర్యాలను ఆయా ప్రాంతాల్లోని సిపిఐ (ఎం) కమిటీలే చూసుకున్నాయని వెంకటయ్య, కుప్పస్వామి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సైకిల్ యాత్ర తమ జీవితంలో మరపురాని మధురఘట్టంగా నిలిచిపోతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

నేడు బహిరంగ సభ

కవాతుకు పదివేల మంది ఎర్రదండు సిద్ధం

ముగియనున్న సిపిఎం 24వ అఖిల భారత మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న ఎపి ప్రతినిధులు కె.లోకనాథం, వై.వెంకటేశ్వరరావు

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాబోయే మూడేండ్ల కాలానికి దేశానికి దిశ, దశా, నిర్దేశం చేసేందుకు వీలుగా మదురైలో కొనసాగుతున్న సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ ఐదో రోజైన శనివారం ముగియనుంది. ఈ సందర్భంగా నగరంలో పది వేల మందితో ఎర్రదండు కవాతును నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు ఎన్.శంకరయ్య స్క్వేర్ (స్థానిక మస్తాన్‌పట్టి దగ్గరల్లోని వండియూర్ రింగ్‌రోడ్ టోల్‌గేట్ ప్రాంతం) వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. తొలుత పుదుగయి భూపాలమ్ కళా బృందం, కామ్రేడ్ గ్యాంగ్‌స్టా మ్యూజిక్ బృందం, కుమారి మురసు సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆ తర్వాత సీపీఐ (ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షతన బహిరంగ సభ ఆరంభమవుతుంది. మదురై ఎంపీ వెంకటేశన్ స్వాగతోపన్యాసం చేస్తారు. సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్‌తోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు కె.బాలకృష్ణన్, యూ.వాసుకి, పి.సంపత్ ప్రసంగిస్తారు. మహాసభల ఆహ్వాన సంఘం కోశాధికారి మధుక్కర్ రామలింగమ్ ధన్యవాదాల ప్రసంగంతో బహిరంగ సభ ముగియనుంది. కాగా ఈ బహిరంగ సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

బహిరంగ సభాస్థలి ముఖద్వారం

కనీస అవసరాలు ప్రాథమిక హక్కు

సిపిఎం అఖిల భారత మహాసభ డిమాండ్

(సీతారాం ఏచూరి నగర్ (మదురై)నుండి ప్రజాశక్తి ప్రతినిధి

ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాలను ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు అఖిల భారత మహాసభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రవేశపెట్టగా, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎఆర్ సింధు బలపర్చారు. 'ఈ కనీస అవసరాలను అందించే సంక్షేమ పథకాలు దాతృత్వ చర్యలు కావు. ఇవి ప్రతి పౌరుడి మౌలిక హక్కులు' అని తీర్మానంలో పేర్కొన్నారు.

'వీటిని పొందడం ప్రతి పౌరుడి హక్కు. ఇవే న్యాయం, సమానత్వానికి పునాది. ఆర్థిక హక్కులు సామాజిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తాయి, సంక్షేమ కార్యక్రమాలు పెట్టుబడులుగా పనిచేస్తాయి,. ఫలితంగా ఎక్కువ ఉత్పాదకత కలిగిన కార్మిక వర్గాన్ని తయారుచేసి, దీర్ఘకాలిక ఆర్థిక అభివద్ధికి దోహదపడతాయి.' అని తీర్మానంలో సిపిఎం వివరించింది. 'నూతన ఉదారవాద విధానాల ప్రవేశంతో, సామాజిక రంగంపై దాడులు మొదలయ్యాయి. ప్రభుత్వాలు ఆరోగ్య, విద్యా రంగాల నుండి తప్పుకోవాలని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వాటిని ప్రైవేటీకరించి తీరాలని ఈ విధానాలు చెబుతాయి. బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం ఈ సంక్షేమ కార్యక్రమాలను నిర్వీర్యం చేయడానికి, సబ్సిడీలను తగ్గించేందుకు ప్రయత్నాలను తీవ్రంచేస్తోంది. ప్రధాని మోడీ ఈ సంక్షేమ పథకాలను 'రేవడీలు' గా పోలుస్తూ, ఇవి దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది అసలు వాస్తవానికి వ్యతిరేకం, ఎందుకంటే ఈ సంక్షేమ కార్యక్రమాలే మార్కెట్ ప్రేరేపిత నూతన ఉదారవాద విధానాల వల్ల నష్టపోయే బలహీన వర్గాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.' అని తీర్మానం వివరించింది. 'సబ్సిడీల ఆధారంగా ఉన్న పథకాల స్థానంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని నగదు బదిలీ పథకాలు చివరికి మౌలిక సామాజిక భద్రతా పథకాలను కుదించడానికి దారితీస్తాయని, ఫలితంగా అత్యంత బలహీన వర్గాలు మరింత దుర్బల స్థితిలోకి వెళ్లిపోతాయని తీర్మానంలో పేర్కొన్నారు. 'ఇది భారత రాజ్యాంగంలోని మార్గదర్శక సూత్రాలు ఉల్లంఘించడమే.! కుల, మత, వర్ణ, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా అందరూ హుందాగా జీవనం సాగించేందుకు హామీ ఇవ్వాలని స్పష్టంగా చెబుతున్నాయి. అయితే, వాటిని అమలు చేయడం లేదు. అందువల్ల వీటిని న్యాయబద్ధమైన రాజ్యాంగ హక్కులుగా మార్చాల్సిన అవసరం ఉంది.' అని తీర్మానం పేర్కొంది. 'నయా ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు "ఆర్థిక భారం" వల్ల ఈ హక్కులను హామీ ఇవ్వలేమని చెబుతాయి. ఇది పూర్తిగా తప్పుడు వాదన. ఎందుకంటే, కార్పొరేట్ పన్నులను నిరంతరం తగ్గించడమే కాకుండా, కంపెనీల నుండి చట్టపరంగా వసూలు చేయాల్సిన పన్నులను వసూలు చేసేందుకు కూడా ప్రభుత్వాలు సిద్ధపడటం లేదు. బిజెపి ప్రభుత్వం ప్రతి ఏడాది కార్పొరేట్ పన్నులను తగ్గిస్తూ వచ్చింది. దీనికి బదులుగా ఒక న్యాయబద్ధమైన పన్నుల విధానాన్ని అమలు చేయడం ద్వారా అవసరమైన అన్ని సేవలు ప్రతి పౌరునికి అందించవచ్చు' అని సిపిఎం తీర్మానంలో తెలిపింది. ఆహారం, నివాసం, ఉపాధి, పెన్షన్, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఈ తీర్మానంలో సిపిఎం ప్రజలకు పిలుపునిచ్చింది.

మరిన్ని తీర్మానాలు...

- వక్ఫ్ సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలన్న తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. దీనిని కేంద్ర కమిటీ సభ్యులు ఎలమరం కరీం ప్రతిపాదించగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు అంజుకుమార్ బలపరిచారు.
- జమ్మూకాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్రహోదా కల్పించడం, ప్రజాస్వామ్యాన్ని బలపర్చడంవంటి చర్యలు తక్షణం తీసు కోవాలి. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి ప్రవేశపెట్టగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్ నర్కార్ బలపర్చారు.
- క్యూబాకు సంఘీభావం తెలపడంతోపాటు, ఆ దేశంపై అమెరికా విధించిన అన్ని అమానవీయ ఆంక్షలను ఎత్తివేయాలన్న తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ ప్రతిపాదించగా, మయూఖ్ బిశ్వాస్ బలపర్చారు.
- ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే యత్నాలను ప్రతిఘటించాలి. ఈ తీర్మానాన్ని సుదీప్ దత్తా ప్రతిపాదించగా, ప్రమోద్ ప్రధాన్ బలపరిచారు.
- డీప్ సీ మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర కమిటీ సభ్యులు థామస్ ఐజాక్ తీర్మానాన్ని ప్రతిపాది ంచగా, ఆలీ కిషోర్ పట్నాయిక్ బలపరిచారు.
- మహిళలు, పిల్లలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని మరియం ధావలే ప్రవేశపెట్టగా, సురేంద్రమల్లిక్ బలపరిచారు.
- యువతలో మాదక ద్రవ్య వ్యసనాన్ని ఎదుర్కో వడానికి సంబంధించిన తీర్మానాన్ని సిసి సభ్యులు సుఖ్వీందర్ సింగ్ షేఖాన్ ప్రతి పాదించగా, అరుణ్‌మెహతా బలపరిచారు.
- ఎల్‌జిబిటిక్యుకు సమాన హక్కుల తీర్మానాన్ని సిసి సభ్యురాలు యు. వాసుకి ప్రతిపాదించగా, కె.నీల బలపర్చారు.
- వికలాంగులకు గౌరవం, న్యాయం కల్పించాల న్న తీర్మానాన్ని ఝూన్సీరాణి ప్రతిపాదించగా, సామ్య గంగూలి బలపర్చారు.
- యుజిసి రూపొందించిన ముసాయిదా నిబంధనలను వ్యతిరేకించాలన్న తీర్మానాన్ని రాజీవ్ కున్వార్ ప్రతిపాదించగా, విపి సాను బలపర్చారు.

కేరళ సిఎం పినరయి విజయన్‌తో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్, దర్శకులు ఎం.సెల్వరాజ్, టిజె.జ్ఞానవేల్

లాల్ సలామ్ కామ్రేడ్...

కేరళ సిఎం పినరయి విజయన్‌తో సినీ నటుడు ప్రకాశ్ రాజ్ భేటి

మదురై నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీపీఐ (ఎం) 24వ మహాసభల్లో భాగంగా శనివారం మదురైలోని సీతారాం ఏచూరి నగర్‌లో నిర్వహించతలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్య వక్తగా పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన కేరళ సీఎంతో సమావేశమయ్యారు. 'లాల్ సలామ్ కామ్రేడ్, హౌ ఆర్ యూ...' అంటూ ఆయన విజయన్‌ను ఆప్యాయంగా పలకరించారు. పినరయి కూడా ప్రకాశ్ రాజ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువురూ కొద్దిసేపు సమకాలీన రాజకీయాల గురించి చర్చించారు. విజయన్‌ను కలిసిన వారిలో సినీదర్శకులు ఎం.సెల్వరాజు, టిజె.జ్ఞానవేల్ కూడా ఉన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రకాశ్ రాజ్... వేదిక వద్దకు చేరుకోగానే భారీ వర్షం మొదలైంది. ఆగకుండా రెండు గంటలపాటు అది కొనసాగటంతో ప్రకాశ్ రాజ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిపోయారు. కాగా... వర్షం కురవటానికి ముందు 'కర్నాటక స్టేట్ డొల్లు కునిత మహిళా బృందం' నిర్వహించిన జానపద నృత్యాలు సభికులను అలరించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారుడు జగన్ ఆధ్వర్యంలో పాడిన 'భరతమాత ముద్దుబిడ్డ సుందరయ్య...' పాట విప్లవ స్ఫూర్తిని నింపింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68